

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 19, సెప్టెంబరు 2025

దోపిడీ తీరిది..

- సోమశిల జలాశయం నుంచి పెన్నానదికి నీరు విడుదల చేసిన కారణంగా 4 రోజులుగా జిల్లాలో ఇసుక అక్రమ రవాణా తగ్గుముఖం పట్టింది. అంతకముందు సంగం, అనంతసాగరం, మినగల్లు, శ్రీరంగరాజపురం ఇలా జిల్లావ్యాప్తంగా అవకాశం దొరికిన అన్ని ప్రాంతాల నుంచి పెన్నా నదిని కుల్లబొడిచి అక్రమంగా ఇసుక తరలించుకొని వెళ్లారు.
- సంగం విషయానికి వస్తే ఇక్కడ డీసిల్టేషన్ పాయింట్‌కు ఎగువ ప్రాంతంలో పెన్నా నది నుంచి విపరీతంగా ఇసుక తవ్వి తరలించారు. గత వైసీపీ హయాం లో ఇసుక అక్రమ రవాణాలో ఆరితేరిన స్మగ్లర్ నేతృత్వంలో (ఇప్పుడు ఈయన తెలుగుదేశం పంచన చేరారు) వందల సంఖ్యలో టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారు. రాత్రుల్లో ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్లు నింపడం, వాయువేగంతో పొరుగు ప్రాంతాలకు తరలించడం పరిపాటిగా మారింది. ఈ స్మగ్లర్ వెనుక తెలుగుదేశం పార్టీలో ఓ నాయకుడు ఉన్నాడు. ఆయన ఓ మాజీ ఎమ్మెల్యేకి సమీప బంధువు. టీడీపీలో చాలా మంది నాయకులకు ఆప్తుడు. ప్రస్తుతం ఈ ముఠా పెరుమాళ్లపాడు నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు గ్రామస్థుల సమాచారం. వెంకటగిరి నియోజకవర్గం కలువాయి మండలం రాజుపాలెం నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలుతోంది.
- బుచ్చిరెడ్డిపాలెం మండలం మినగల్లు ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిలో వైసీపీకి చెందిన వారు ఉన్నారు. గత ప్రభుత్వంలో చేసినట్లే ప్రస్తుత ప్రభుత్వంలోనూ వారే చక్రం తిప్పుతున్నారు. జొన్నవాడ, శ్రీరంగరాజపురం ప్రాంతాల నుంచి రెండు ప్రధాన పార్టీలకు చెందిన కొందరు నాయకులు ఇసుక అక్రమ రవాణాలో భాగస్వాములుగా ఉన్నారు.
- **అనంతసాగరం:** గ్రీన్ ట్రిబ్యునల్, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అక్టోబరు 15 వరకు ఇసుక తరలింపునకు అనుమతుల్లేవు. అయితే, అనంతసాగరం మండలం పీకేపాడు రీచ్‌లో భారీ యంత్రాల ద్వారా ట్రాక్టర్ల కొద్దీ ఇసుక తరలిపోతోంది. జిల్లాకు చెందిన ఓ అమాత్యుడి సమీప బంధువే ఈ రీచ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం.
- **మర్రిపాడు:** పడమటి కంభంపాడు రీచ్ నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. టిప్పర్ల దాటికి చిన్న వాహనదారులు భయం గుప్పిట్లో రాకపోకలు సాగిస్తున్నారు. రీచ్‌లో ఇసుక లోడ్ అయ్యాక తొలుత నకిరేకల్ - ఏర్పేడు (565) జాతీయ రహదారిపై ప్రయానిస్తాయి. ఆ తరువాత చుంచులూరు నుంచి నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల మీదుగా బెంగళూరుకు వెళుతన్నాయి.
- **కందుకూరు:** కందుకూరు నియోజకవర్గంలో ఉన్న మన్నేరు ఇసుకను లారీలలో సరిహద్దులు దాటిస్తున్న అక్రమార్కులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. దప్పళంపాడు, కళవళ్ల, మాచవరం, ఆత్మకూరు, మన్నేటికోట తదితర ప్రాంతాలలో నాణ్యమైన ఇసుక నిల్వలు ఉన్నాయి. దప్పళంపాడు చెక్‌డ్యాం పరిసరాల్లో అయితే వేల టన్నుల ఇసుక నిల్వలు ఉండగా, ఇసుకను ట్రాక్టర్లలో బయటకు తరలించి ఒక ప్రదేశంలో డంప్ చేసుకోవటం, రాత్రిపూట లారీలకు లోడ్‌చేసి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. ప్రకాశం జిల్లాలోని కనిగిరి, మార్కాపురం, ఎర్రగొండపాలెం ప్రాంతాలకు అటు నుంచి హైదరాబాద్‌కు కూడా మన్నేరు ఇసుక తరలుతున్నట్లు సమాచారం.
- **కోవూరు/విడవలూరు:** కోవూరు మండలంలోని వేగూరు, జమ్మిపాళెంలోని అనధికార రీచ్‌ల నుంచి విడవలూరు మండలం ముదివర్తి రీచ్ నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కోవూరు, విడవలూరు మండలాల్లోని ట్రాక్టర్ల యజమానులు బృందంగా ఏర్పడి ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లు జాతీయ రహదారిపై రాకుండా గ్రామీణ అడ్డరోడ్లలోనే రాకపోకలు సాగిస్తున్నాయి.





● సీఎం ఆదేశాలూ బేఖాతర్

ఇసుక స్మగ్లింగ్‌కు పాల్పడితే తాట తీస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిస్తున్నా అధికారుల చెవికెక్కడం లేదు. స్మగ్లర్ల నుంచి అందే మామూళ్ల మీద ఉన్నంత ధ్యాస, సీఎం ఆదేశాలను అమలు చేయాలన్న విషయంలో లేకపోవడంతో పాలన పూర్తిగా గాడితప్పుతోంది. ఇసుక, గ్రావెల్ స్మగ్లింగ్‌లో గత వైసీపీకి, ఇప్పటి తెలుగుదేశం పార్టీకి ఏమాత్రం తేడా లేదనే భావన ప్రజల్లో వ్యక్తం అవుతోంది. అధికార పార్టీ ముసుగులో కొంతమంది చేసే ఈ అక్రమాల వల్ల ప్రభుత్వానికి, టీడీపీకి చెడ్డపేరు వస్తోందని ఆ పార్టీకి చెందిన నాయకులే ఆవేదన చెందుతున్నా, అక్రమార్కుల ధాటికి జడిసి మనకెందుకొచ్చిందిలే అని మౌనం గా ఉండిపోతున్నారు. ఇది అక్రమార్కుల్లో మరింత నైతిక స్థైర్యం కలిగిస్తోంది.

నాడు నేడూ వారే!

ఆంధ్రజ్యోతి పరిశీలన

- అధికార పార్టీ ముసుగులో ఇసుక అడ్డగోలు దోపిడీ
- ప్రజాప్రతినిధుల అండ... నేతలదే ఇష్టారాజ్యం
- జిల్లా సరిహద్దులు దాటుతున్న ప్రకృతి సంపద
- రయ్.. రయ్‌మంటూ దూసుకెళుతున్న టిప్పర్లు
- వాటి వేగానికి ఛిద్రమవుతున్న బతుకులు
- శిక్షణ లేని డ్రైవర్ల చేతికి స్టీరింగ్‌లు
- మామూళ్ల మత్తు.. ఆపై ఒత్తిళ్లు
- కళ్లున్న కబోదిలా అధికార యంత్రాంగం

నెల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగం మండలం పెరమన వద్ద ఏడుగురిని పొట్టనపెట్టుకున్న ఇసుక టిప్పర్ సాదాసీదాది కాదు. గత వైసీపీ హయాంలో ఇసుక స్మగ్లింగ్‌లో చెయ్యి తిరిగిన ఒక మాఫియా లీడర్ సారథ్యంలో నడిచేదిగా ప్రజలు చెప్పుకొంటున్నారు. ఈ మాఫియా లీడర్ ఇప్పుడు అధికార తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. ఈయన ప్రజా సేవకుడనో, ఈయన చేతిలో పదివేల ఓట్లు ఉన్నాయనో ఆయన్ను ఆ పార్టీలోకి తీసుకోలేదు. ఇసుక స్మగ్లింగ్‌లో చేయితిరిగిన ఘనుడని కొంతమంది నాయకులు ఈయన్ను పక్కన పెట్టుకున్నారు. రాజకీయ పరపతితో ఆ స్మగ్లర్‌ను కాపుకాస్తున్నారు. ఈయన సారథ్యంలో వందల కొద్ది టిప్పర్లు నడుస్తున్నాయి. నకిరేకల్-ఏర్పేడు, నెల్లూరు -ముంబాయి జాతీయ రహదార్లపై ఈయన నేతృత్వంలోని టిప్పర్లు అడ్డూ అదుపులేకుండా రయ్.. రయ్...మంటూ దూసుకెళుతున్నాయి. మన ఇసుకను కొల్లగొట్టి పక్క జిల్లాలకు, రాష్ట్రాలకు తరలిస్తున్నాయి. ఈ టిప్పర్లను నడిపే డ్రైవర్లకు ఒకటే లక్ష్యం. శరవేగంగా గమ్యస్థానం చేరడం. వాటి వేగం ధాటికి ఎదురొచ్చిన వాహనాలపై ఎక్కిస్తున్నారు. ఒకవైపు చట్ట వ్యతిరేకంగా ఇసుకను కొల్లగొడుతూ, మరోవైపు విపరీతమైన వేగంతో ప్రజల ప్రాణాలు హరిస్తున్న ఇలాంటి వాహనాలు పెన్నా పరివాహక ప్రాంతం అంతటా పెద్ద సంఖ్యలో తిరుగుతున్నాయి.

● శిక్షణ లేని డ్రైవర్లతో..

సంగం, అనంతసాగరం ప్రాంతాల నుంచి రాత్రుల్లో అక్రమంగా తరలించే ఇసుక టిప్పర్లతో చిన్న వాహనదారులకు భద్రత కరువయ్యింది. విపరీతమైన లోడుతోపాటు తగిన శిక్షణ లేని డ్రైవర్లు భారీ గూడ్స్ వాహనాలను తోలడంతో ఎటువైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందో అంతుపట్టని పరిస్థితి. భారీ గూడ్స్ వెహికల్స్‌ను కనీస శిక్షణ లేని డ్రైవర్లు నడుపుతున్నారనే విషయాన్ని ఇటీవల ఆర్టీయే అధికారులు గుర్తించడం గమనార్హం.



అవును.. అక్రమ తరలింపే!

- పోలీసుల విచారణలో బహిర్గతం
- డ్రైవర్‌తోపాటు టిప్పర్ యజమానిపై కేసు
- ఇసుక మాఫియా డాన్‌పై కూడా..
- తెర వెనుక ఓ ప్రజాప్రతినిధి మంత్రాంగం
- కేసు నీరుగార్చేందుకు విశ్వప్రయత్నం

సంగం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై పెరమన వద్ద ఏడుగురి ప్రాణాలను బలిగొన్న టిప్పర్‌లో తరలిస్తున్న ఇసుక అక్రమమేనని పోలీసుల విచారణలో బహిర్గతమైంది. అయితే ఈ విషయం బయటకు చెప్పడానికి పోలీసులు సంకోచిస్తున్నారు. ఈ మాఫియా వెనుక అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి హస్తం ఉండటంతో కేసు నమోదుకు పోలీసులు సంకోచిస్తున్నారు. అయితే, జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి ప్రమాదానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ అజితను ఇప్పటికే ఆదేశించిన విషయం విదితమే. ఈమేరకు ఇసుక అక్రమ తరలింపుపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులను ఆమె ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే, సదరు ప్రజాప్రతినిధి మాత్రం ఈ కేసులో ఇసుక మాఫియా డాన్‌తోపాటు టిప్పర్ యజమానిని తప్పించాలని పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

● బుకాయింపు..

ప్రస్తుతం జిల్లాలో డీసిల్టేషన్ అనుమతి ఉన్న సంగం, సూరాయపాళెం పోతిరెడ్డిపాళెం డంపింగ్ కేంద్రాల నుంచి మాత్రమే ఇసుక తరలించాలి. కానీ సంగం ఇసుక డంపింగ్ యార్డుకు ఎగువన పెరమన వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. అంటే టిప్పర్ ఆత్మకూరు వైపు నుంచి ఇసుక లోడుతో వచ్చింది. కాబట్టి ఇసుక తరలింపు ముమ్మాటికీ అక్రమమేనని పోలీస్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన టిప్పర్ డ్రైవర్ మాత్రం ఓ నాయకుడికి చెందిన క్వార్ట్జ్‌లో ఇసుక నిల్వ ఉంటే తరలిస్తున్నట్లు చెప్పినా, అక్కడా ఇసుక లేకపోవడంతో కేసు నుంచి తప్పించుకునేందుకు మాఫియా ఆడుతున్న నాటకమని పోలీసులు నమ్మడం లేదు. ఇది తెలుసుకున్న ఎస్పీ ప్రమాద ఘటనతోపాటు ఇసుక అక్రమ తరలింపులో ఉన్న వారిపైన కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు.


● తెర వెనుక నేతలు

గత ప్రభుత్వంలో ఇసుక మాఫియా డాన్‌గా వ్యవహరించిన నియోజకవర్గంలోని ఓ వ్యక్తే ప్రస్తుత ప్రభుత్వంలోనూ మాఫియా నడుపుతున్నారని

- మిగతా 7లో..


అనంతసాగరం : పీకేపాడు రీచ్‌లో బయట పడ్డ భూగర్భజలాలు


అనంతసాగరంలో ట్రాక్టర్


మర్రిపాడు దూసుకెళుతున్న టిప్పరు


ఉలవపాడు : ఆత్మకూరు వద్ద మన్నేరులో ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్


కందుకూరు ప్రాంతంలో రాత్రిపూట..


కోవూరు : పెన్నాతీరం నుంచి..

'విజయ'లో ఎన్నికల కోలాహలం

- వివరాలు 8లో..

'వాహన మిత్ర' దరఖాస్తుకు నేటితో గడువు పూర్తి

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆటో, మాక్సీ క్యాబ్ వాహన యజమానులు వాహన మిత్ర పథకం కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని సూచించారు. వాహన రిజిస్ట్రేషన్ కార్డు, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తదితర సర్టిఫికెట్లతో దరఖాస్తులు అందించాలని, బ్యాంక్ ఖాతాకు ఆధార్, ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారు మరలా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



వెంకటాచలం : కసుమూరులోని మస్తాన్‌వలి దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

ఏఎస్‌పేటలో గంధం దంచుతున్న ముస్లిం మత పెద్దలు

8



భక్తసు 'గంధం'!

కసుమూరు, ఏఎస్‌పేటలో భక్తుల సందడి

వెంకటాచలం మండలం కసుమూరు మస్తాన్‌వలి 248వ గంధమహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. దర్గాను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అలాగే ఏఎస్‌పేటలోని శ్రీహజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా 252వ గంధమహోత్సవాన్ని గురువారం అర్ధరాత్రి నిర్వహించడానికి అన్నీ సిద్ధం చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

సంగం, (ఆంధ్రజ్యోతి): పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ సంఘటనలో తాళ్లూరు శ్రీనివాసులు, రాధ, చల్లగుండ్ల శ్రీనివాసులు, లక్ష్మి అనే దంపతులతోపాటు శేషం సారమ్మ, వేషం బాలవెంగయ్య, కారు డ్రైవర్ కత్తి బ్రహ్మయ్య మొత్తం ఏడుగురు మృతి చెందని విష యం విదితమే. దీంతో ఒక్కో మృతుడికి రూ.5లక్షల చొప్పున సీఎం సహాయనిధి నుంచి బాధితులకు అందచేయాలని అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థుల కార్యక్రమం వాయిదా

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా మెగా డీఎస్సీ-2025 నూతన ఉపాధ్యాయుల నియామక పత్రాల అందచేత కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం గుంటూరులో భారీ వర్షాల ఉన్నందున అభ్యర్థుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని వాయిదా వేశారన్నారు. త్వరలో కార్యక్రమ నిర్వహణ తేదీలను ప్రకటిస్తామని తెలిపారు.

కరేడులో రైతులకు పరిహారం

- 368.19 ఎకరాలకు 78.18 కోట్లు
- రైతుల ఖాతాల్లో నగదు జమ

కందుకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చేదిలేదంటూ రైతులు ఓ వైపు నిరసనలు చేస్తుండగా మరోవైపు భూసేకరణ ప్రక్రియ సాగిపోతోంది. ఇప్పటికే 1300 ఎకరాలకు సంబంధించిన రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకారపత్రాలు ఇవ్వగా ఇప్పటికి నాలుగు విడతలుగా 186 మంది రైతులకు సంబంధించిన 368.19 ఎకరాలకు పరిహారంగా 78.19 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లో జమచేశారు. మిగిలిన భూములకు సంబంధించి కూడా రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసి రైతుల ఖాతాలకు నగదు జమచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు భూసేకరణ అధికారి రాజశేఖర్ తెలిపారు. ఇండోసోల్ సోలార్ పరిశ్రమ ఏర్పాటుతో వేలాదిమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని ఈ ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తుందన్న లక్ష్యంతో ప్రభుత్వం భూసేకరణ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవటంతో ఇటు అధికార యంత్రాంగం అటు ఇండోసోల్ సోలార్ కంపెనీ ప్రతినిధులు రైతులను కలుస్తూ భూసేకరణ ప్రక్రియకు వారినుంచి అంగీకారపత్రాలను తీసుకోవటంలో సఫలమయ్యారు. బయటి గ్రామాలకు సంబంధించి అంగీకారపత్రాలు స్వీకరణ దాదాపు పూర్తయినట్లేనని, ఇకపై భూసేకరణ అడుగు ముందుకు పడాలంటే కరేడు రైతుల నుంచి మార్పు అవసరం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

లక్కీడ్రాలో 12 బార్‌ల కేటాయింపు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా తొలి నోటిఫికేషన్‌లో మిగిలిన 33 బార్లకు కలెక్టరేట్‌లో గురవాఆరం ఉదయం కలెక్టర్ హిమాన్షు శుక్ల బార్లకు లాటరీ నిర్వహించారు. ఈ క్రమంలో నగరంలో 7 బార్లు, కావలిలో 3, బుచ్చిలో 1, గీత కార్మికులకు సంబంధించి అల్లూరులో ఒక బారుకు లాటరీ తీశారు. ఈ సందర్భంగా లాటరీలో విజేతలుగా నిలిచిన వ్యాపారులకు బార్లు కేటాయించారు. మిగిలిన 21 బార్లకు మరోమారు నోటిషికేషన్ జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో డీసీ శంకరయ్య, ఈఎస్ శ్రీనివాసుల నాయుడు, ఏఈఎస్ రమేష్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సోమశిలకు 18,715 క్యూసెక్కుల వరద

అనంతసాగరం సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 18,715 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. డ్యాంలో నీటి నిల్వ 73.268 టీఎంసీలకు చేరుకోగా, దిగువ డెల్టాకు పవర్ టెన్నల్ నుంచి 350, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఏఆర్ ఏఎస్పీ మునిరాజ్ బదిలీ

4 నెలల తర్వాత జీవో ● కి'లేడీ' విషయంలోనే అప్పట్లో బదిలీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 18((ఆంధ్రజ్యోతి) : చాలా రోజుల తర్వాత కి'లేడి' అరుణ విషయం చర్చగా మారింది. గతంలో ఏఆర్ ఏఎస్పీగా ఉన్న ఓ అధికారి లేడీ డాన్‌తో మాట్లాడిన మాటలు సంచలనంగా మారాయి. ఈ క్రమంలో గతంలోనే జిల్లాకు చెందిన ఆ ఏఎస్పీని జిల్లా నుంచి బయటకు పంపిన విషయం తెలిసిందే. అయితే నాలుగు నెలల తర్వాత ఆ అధికారిని నెల్లూరు నుంచి డీజీ కార్యాలయానికి బదిలీ చేస్తున్నట్లు గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యార్థులకు భూసార పరీక్షలపై శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మండల వ్యవసాయాధికారి ఎస్ శ్రీహరి భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ దేవసేన మాట్లాడుతూ పంటకు అవసరమైన పోషకాలు, వాటి ఉపయోగాలను తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనూష మట్టి రకాలను వివరించి వాటి నమూనాలను చూపించారు. ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, వ్యవసాయ సహాయకులు, వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10536
వెండి కిలో ధర	రూ. 132400
వెండి ఒక గ్రాము	రూ. 135.40

మోటారు చోరీ చేశాడని దాడి

● ఒకరి పరిస్థితి విషమం ● మరో నలుగురికి గాయాలు



పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మోటారు చోరీ చేశాడంటూ కొంతమంది ఓ ఇంట్లోకి చొరబడి ప్రసాద్ అనే యువకుడిపై దాడి చేయడంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ సంఘటన బుచ్చిలోని రాఘవరెడ్డి కాలనీలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గురువారం పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు శైలజ, వెంకటరమణయ్య మాట్లాడుతూ ఎందుకు కొట్టారని అడిగినందుకు నిందితులు రెండు ఆటోలలో వచ్చి మరో నలుగురిని కొట్టేందుకు ఇళ్లపై పడి మారణాయుధాలతో దాడులు చేశారని వాపోయారు. తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్‌ను నెల్లూరుకు తరలించగా, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు. ఈ దాడుల్లో ఆదిశేషయ్య, శైలజ, భవాని, అత్తిపాటి శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

టచ్ చేస్తే.. తిరిగిరాని లోకాలకే!

● తక్కువ ఎత్తులో విద్యుత్ స్తంభాలు



యాదవ వీధిలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

పొదలకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పలుచోట్ల ఉన్న విద్యుత్ స్తంభాలు రెండు దశాబ్దాల నాటివి కావడంతో ఎత్తు తక్కువై ప్రమాదకరంగా మారడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన అధికారులు ఏడాది క్రితం ఎత్తుగా ఉన్న నూతన విద్యుత్ స్తంభాలు అమర్చారు. అయితే ఏడాది క్రితం నూతనంగా నాటిన ఎత్తయిన విద్యుత్ స్తంభాలకు, పాత విద్యుత్ స్తంభాల నుంచి కొత్తవాటికి తీగలను అమర్చకపోవడంతో సమస్య అలానే ఉంది. పలుమార్లు పట్టణవాసులు విద్యుత్ అధికారులకు వినతిపత్రాలు అందించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. గట్టిగా అడిగితే ఆ విద్యుత్ వైర్లకు అయ్యే ఖర్చు మీరు భరించుకుంటే మారుస్తున్నామని తెగేసి చెబుతున్నారు. దీంతో పట్టణవాసులు ఏమీ చేయ లేక మిన్నకుండిపోతున్నారు. అయితే తక్కువ ఎత్తులో ఉన్న ఈ విద్యుత్ స్తంభాల తీగల వల్ల ప్రాణాపాయం పొంచి వుంది. రామాలయం, శివాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఏ ఉత్సవాలు జరుగుతున్నా యాదవ వీధి, రామాలయం మీదుగా ఉత్సవమూర్తులను ఊరేగించడం ఆనవాయితీ. ఇటీవల వినాయక చవితి ఉత్సవాల సమయంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగల వల్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

పొంచి ఉన్న ప్రాణాపాయం

ఈ విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందని పట్టణవాసులు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు, పాత స్తంభాల నుంచి వైర్లు మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. త్వరలో విద్యుత్ వైర్లను మారుస్తామని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

శ్రీనివాసులు హత్య కేసు..
ఇరువురి అరెస్ట్ : రిమాండ్‌కు తరలింపు

లింగసముద్రం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్లలో ఈనెల 9న జరిగిన ఆవుల శ్రీనివాసులు హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇరువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుడ్లూరు సీఐ జీ. మంగారావు గురువారం ఓ ప్రకటనలో కేసు వివరాలను వెల్లడించారు. శ్రీనివాసులు ఇంటి వరండాలో ఒంటరిగా నిద్రిస్తుండగా, అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీనివాసులును ఆయుధంతో బలంగా కొట్టి చంపారని ఆయన పెద్ద కుమార్తె మనీషా లింగసముద్రం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గుడ్లూరు సీఐ మంగారావు దర్యాప్తు చేపట్టారు. మృతుడు శ్రీనివాసులుకు ఐదు సంవత్సరాల క్రితం భార్య చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న ఆవుల శ్రీదేవితో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. అయితే వలేటివారిపాలెం మండలంలోని బొంతవారిపాలెంకు చెందిన సాదం రాజేంద్రప్రసాద్‌తో శ్రీదేవి వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం తెలిసిన మృతుడు శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో అసూయతో ముద్దాయిలిద్దరు మృతుడు శ్రీనివాసులును ఇనుప హెక్‌తో అతి కిరాతకంగా కొట్టి చంపారు. దీంతో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు ముద్దాయిలను అరెస్ట్ చేసి కందుకూరు కోర్టులో హాజరుపరచగా, కోర్టు వారికి రిమాండ్ విధించింది. ఈ హత్య కేసు ఛేదింపులో సీఐకి సహకరించిన ఎస్ఐ ఎంనారాయణ, కానిస్టేబుళ్ళు మునికృష్ణ, నారాయణ, మీరాబాషా, నజ్రుల్లా, ప్రదీప్ కుమార్, హెచ్‌జీ శ్రీనివాసులును పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

ఎస్సీ అట్రాసిటీ కేసులో రెండేళ్ల జైలు

ఉలవపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దళిత మహిళలను కులం పేరుతో దూషించి, దాడిచేసిన కేసులో ఒంగోలు 7వ ఏడీజే కోర్టు ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.1200 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. 2020 ఆగస్టు 8న కరేడుకి చెందిన యానాది కులానికి చెందిన మహిళ గేదెను మేత కోసం పొలానికి తోలుకెళ్లింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ముద్దాయి నక్కా రమేష్ (33) పొలం గట్టుపైన గేదెను తోలుకెళుతుండగా సదరు ముద్దాయి తన పొలంలో గేదెను మేపుతావా? అంటూ బాధిత మహిళను కులం పేరుతో దూషించడమే కాకుండా భౌతికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు తన కుమారుడితో కలిసి అదేరోజు ఉలవపాడు పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి కందుకూరు డీఎస్పీ కండే శ్రీనివాసరావు దర్యాప్తు చేసి చార్జిషీటు కోర్టుకు దాఖలు చేశారు. సాక్ష్యాలను పొందుపరిచారు. ఈ కేసుపై ఐదేళ్ల విచారణ అనంతరం ఒంగోలులోని 7వ ఏడీజే జడ్జి టీ రాజావెంకటాద్రి గురువారం ఈ మేరకు తీర్పు వెల్లడించారు. కేసును వాదించడంతో ప్రతిభ కనబరచిన స్పెషల్ పీపీ వై ప్రశాంతి కుమారి, కేసు విచారణ చేపట్టిన డీఎస్పీ కండే శ్రీనివాసరావు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లును ఎస్పీ అజిత వెజెండ్ల అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

కావలి రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు ట్రంక్ రోడ్డులో గురువారం రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ రామిశెట్టి నవీన్‌కు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. కావలి నుంచి చేపల లోడుతో నెల్లూరు వైపు వెళ్తున్న లారీ ట్రంక్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా మరో వాహనం రోడ్డుపై చేరిన వర్షపు నీటిలో వేగంగా రావటంతో ఆ నీరు ఎగిరి చేపల లోడుతో వెళ్తున్న లారీలోని డ్రైవర్‌పై పడ్డాయి. దీంతో లారీని ఒక్క సారిగా ఆపటంతో కావలి నుంచి చంద్రబాబు కాలనీకి వెళ్తున్న ఆటో లారీ వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలయ్యాయి.

పొగాకు పెంపకానికి అనుమతులు తప్పనిసరి

కలిగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో పొగనారుమళ్ళు సాగుచేసే రైతులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని వేలం నిర్వహణాధికారి వి శివకుమార్ తెలిపారు. గురువారం వేలం కేంద్రం పరిధిలోని రాచవారిపల్లి, దుత్తలూరు లక్ష్మీపురం గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న పొగాకు నారుమళ్లను బోర్డు అధికారులు, సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా నారుమళ్ళ సాగులో యజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన నారుఉత్పత్తి చేయాలని కోరారు. అదేవిధంగా పొగాకు నర్సరీలు, నారుమళ్ల అనుమతి లేకుండా సాగుచేస్తే పొగాకుబోర్డు చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. అదేవిధంగా అనుమతి లేకుండా సాగుచేసిన వారివద్ద నారు కొనుగోలుచేసి రైతు పంట వేసినా వారి బ్యారన్ లైసెన్సు రద్దుచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్రాధికారి సంతోష్‌కుమార్, క్షేత్రసహాయకులు హజరత్‌బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 730 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 495 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 235 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 344 కాగా, కనిష్ఠ ధర రూ. 100 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

ఉప ఖజానా కార్యాలయం తనిఖీ

ఉదయగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉప ఖజానా కార్యాలయాన్ని గురువారం జిల్లా ఖజానాధికారి గంగాద్రి తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప ఖజానాధికారి ఉస్మాన్, సీనియర్ అకౌంటెంట్లు ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

2003 డీఎస్సీ ఉపాధ్యాయుల
సమస్యలు పరిష్కరించాలి

వింజమూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు గురువారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సానుకూలంగా స్పందించి ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు మాలకొండయ్య, మాల్యాద్రి, చిన్నబాబు, సుధీర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో చక్కటి ఆరోగ్యం

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం సాధ్యమవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రుబీనా తెలిపారు.(శింగమనేనిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 8వ రాష్ట్ర పోషణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

మహిళలకు వైద్య పరీక్షలు

ఉదయగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లిలో గురువారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 101 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని గండిపాళెం పీహెచ్‌సీ పరిధిలోని మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి శివకల్పన సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●**వింజమూరు:** మండలంలోని కాటేపల్లి పంచాయతీ కాటేపల్లి గ్రామంలో గురువారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో చాకలికొండ పీహెచ్‌సీ డాక్టర్ మురళీధర్, సీహెచ్‌సీ సక్కు బాయమ్మ, పీఎస్ నరసింహారెడ్డి, హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు, కాటేపల్లి పంచాయతీ అధ్యక్షుడు వెంకటరత్నం, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీ మెరుగైన సేవలు: డీఎం

ఆత్మకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం అని ఆత్మకూరు డిపో మేనేజర్ ఎం శివకేశవ్‌యాదవ్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రయాణికులు పలు సమస్యలను తమ దృష్టికి తెచ్చారని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

పిడుగుపాటుకు వృద్ధుడి మృతి

కోవూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేగూరు గ్రామ పొలిమేరల్లోని పొలాల్లో గురువారం పిడుగు పడడంతో దళిత కాలనీకి చెందిన గోళ్ళ వెంకయ్య (64సం) అక్కడికక్కడే మృతి చెందాడు. పశువుల్ని తోలుకుని ఇంటికి వస్తుండగా పిడుగుపాటుకు బలయ్యాడు. కోవూరు పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గోళ్ళ వెంకయ్య మృతితో వేగూరు దళిత కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

బాలుర పాఠశాలలో స్కూల్ గేమ్స్



చదరంగం పోటీలలో నిమగ్నమైన విద్యార్థులు

మనుబోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను గురువారం నిర్వహించారు. ఎంఈవోలు ఓబులు, రమేష్ కుమార్‌లు ఈ పోటీలను ప్రారంభించారు. మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల నుంచి సుమారు 200మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. వీరికి అండర్ -14,17 విభాగాల కింద బాలురకు, బాలికలకు విడివిడిగా 100మీ, 200మీటర్ల పరుగుపందెం, జావెలిన్,షాట్ పుట్, చదరంగం పోటీలను నిర్వహించి విజేతలను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ మండల కో-ఆర్డినేటర్ మంజువాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం. అమూల్యకుమారి, పీడీలు ఏడుకొండలు, శ్రీధర్, మదుసూదన్ రావు, ప్రతిమ, మురళి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

పొదలకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోడీ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పొదలకూరు మండలం బిరదవోలు పంచాయతీలో బీజేపీ నాయకులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా మాజీ ఉపాధ్యక్షుడు మారుతీకుమార్ రెడ్డి, మండలాధ్యక్షుడు పూల ప్రశాంత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అందరూ మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం, దాసరి సురేంద్రబాబు, మండల ఉపాధ్యక్షుడు చొప్పా వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి అక్కిం జనార్దన్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గురుస్వామి, టౌన్ అధ్యక్షుడు సిరిగిరి ఓబులేసు, అయోధ్య రామయ్యగౌడ్, అక్కిం రమణారెడ్డి, రవీంద్ర, రమణమ్మ, బుధవరపు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పందెం కోళ్లు కాదు.. పెరటికోళ్లు!

● పొదుపు మహిళలకు పంపిణీ చేసిన ప్రభుత్వం



పెరటి కోళ్లను చూపుతున్న వీవోఏలు

మనుబోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇదేంటీ.. కోళ్లు పట్టుకుని మహిళలు, పురుషులు ఇలా బరిలోకి దిగారు.. ఇదేదో కోడిపందెం స్థావరంలాగ ఉందే! ఇదేగా మీ డౌట్? అయ్యో.. అలాంటిదేమీ లేదండీ.. ఇవి పందెం కోళ్లు కాదు...పెరటి కోళ్లు. అవునా.. కొత్తగా ఈ పెరటి కోళ్లేంటి? అనుకుంటున్నారా?.. అవునండీ.. రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు పెంచుకునేందుకు పంపిణీ చేసిన కోళ్లు. గురువారం మండలంలో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వ ఆదేశాలతో కోయంబత్తూరు నుంచి తెప్పించిన పెరటి కోళ్లను వెలుగు వీవోఏలు పొదుపు మహిళలకు అందజేశారు. మండలవ్యాప్తంగా 29 మంది వీవోఏల పరిధిలో ఐదేసి యూనిట్లు చొప్పున కోళ్లను అందించారు. ఒక్కో యూనిట్‌లో 11 కోళ్లు ఉంటాయి. వీటిలో మూడు పుంజులు. 8 పెట్టలు ఉన్నాయి. మొత్తంగా 1595 పెరటికోళ్లను అందించారు. ఒక్కో యూనిట్‌కు సదరు మహిళలు రూ. 3,300 చెల్లించాలి. కోళ్ళతో పాటు, అవి అనారోగ్యంబారిన పడకుండా మందులు కూడా ఇస్తారు. ఈ కోళ్ళకోసం డ్వాక్రా మహిళలు పోటీ పడి మరీ తీసుకెళ్లారు. భలేగున్నాయ్ కదూ... పెరటి కోళ్లు!

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం మండల సమాఖ్య తరపున 100 మంది పొదుపు సంఘాల సభ్యులకు గురువారం 100 యూనిట్ల పెరటికోళ్ల పంపిణీ చేశారు. స్థానిక వెలుగు కార్యాలయం, పెనుబల్లిలో పెరటికోళ్ల పంపిణీ చేశారు. దామరమడుగులో 36 యూనిట్లు, ఇస్కపాళెం 30 యూనిట్లు, జొన్నవాడ క్లస్టర్‌లో 34 యూనిట్లు పంపిణీ చేశారు. యూనిట్‌కు 11 పెరటి కోళ్ల ప్రకారం రూ.3,300తో సభ్యులు కొనుగోలు చేసినట్టు ఏపీఎం శ్రీధర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచు ఊడా పెంచలయ్య, కెనరా బ్యాంకు మేనేజరు, సీసీలు, వీఓఏలు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక వ్యాన్



వ్యాను ప్రారంభిస్తున్న మండల టీడీపీ అధ్యక్షులు మల్లికార్జునయాదవ్

ముత్తుకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పైనాపురం పంచాయతీ పరిధిలోని దేవరదిబ్బ గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వ్యాన్ సర్వీస్‌ని గురువారం మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం గిరిజనుల అభ్యున్నతిని ఆకాంక్షించే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నియోజకవర్గంలో ఎస్టీల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. దేవరదిబ్బ నుంచి మునూరువారిపాలెం ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే గిరిజన చిన్నారుల కోసం ఈ వ్యాన్ ఉచితంగా నడుస్తుందన్నారు. మూడు కిలోమీటర్లు వెళ్లి స్కూల్ నుంచి మరలా ఇంటికి వచ్చేందుకు మూడు కిలోమీటర్లు దూరం పిల్లలు నడుస్తున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి ఎస్ఈఐఎల్ సంస్థ సహకారంతో ఈ వ్యాన్ సర్వీస్ ఉచితంగా ఏర్పాటు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ తోపాటు కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కావలి విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు పట్టపు శోభన్, ఎస్ఈఐఎల్ ప్రతినిధులు జెండా ఊపి వ్యాన్‌ను ప్రారంభించారు. 'థ్యాంక్యూ ఎమ్మెల్యే సోమిరెడ్డి సార్' అంటూ చిన్నారులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాంతారావు, మాజీ సర్పంచ్ పట్టపు రమేష్, దాసరి రమేష్, నరసింహ, జనార్ధన్, ఏడు కొండలు పాల్గొన్నారు.

రీసర్వేలో తప్పిదాలను సవరించాలని రైతుల ఆందోళన



నిరసన తెలుపుతున్న వెంకటయ్య, రైతులు

ఉదయగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి రెవెన్యూ పరిధిలో భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలను సవరించాలని గురువారం జిల్లా రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. తహసీల్దారు కార్యాలయం లోపల తహసీల్దారు ఎదుట నేలపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండగానిపల్లి రెవెన్యూలో జరిగిన రీసర్వే అంతా గందరగోళంగా చేపట్టారన్నారు. దీంతో రైతులకు అడంగల్, 1బీ రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దారు రామ్మోహన్ రీసర్వేలో తప్పిదాలు జరిగిన రైతులు వివరాల జాబితాను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ధూపదీప నైవేద్య పథకాన్ని అమలు చేయండి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు పార్టీ నేతల వినతి



మాధవ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నేతలు

వెంకటాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ హిందు దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకాన్ని అమలు చేయాలని పరమేశ్వరి అమ్మవారి దేవాలయాల పరిరక్షణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ జిల్లా నేత ఆరుముళ్ల మురళీ కోరారు. విజయవాడలో గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వినతి పత్రాన్ని అందజేశారు. ధూపదీప నైవేద్య పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్నప్పటికి ఎస్సీ, ఎస్టీ కాలనీలలో ఉన్న హిందు దేవాలయాలకు మంజూరు కావడం లేదన్నారు. ప్రత్యేక చొరవ తీసుకుని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఉన్న దేవాలయాలకు పథకాన్ని మంజూరు చేయించడంతోపాటు, అవసరమైన చోట కొత్త దేవాలయాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి రాధాకృష్ణయ్య, సభ్యులు ప్రసాద్, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీజేఎఫ్ఎస్ రైతులను గుర్తించిన అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు గ్రామంలో పేదలకు ప్రభుత్వం 1992లో పంపిణీ చేసిన 100 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములకు సంబంధించి డీకేటీ పట్టాల పంపిణీ కోసం అప్పటి రైతులను, వారిలో మృతి చెందిన పట్టాదారుల రక్త సంబంధీకులను గుర్తించినట్టు తహసీల్దారు వేంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మినగల్లులో గ్రామ సభ నిర్వహించి వారి వివరాలు సేకరించారు. అప్పట్లో ప్రభుత్వం భూములు పంపిణీ చేసినా, హద్దులు చూపలేదు. దీంతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవతో తహసీల్దారుతో కలిసి జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ ఆ భూములను పరిశీలించి ఆ రైతులతో మాట్లాడి పట్టాల పంపిణీకి చర్యలు చేపట్టారు. దీంతో త్వరలో ఆయా రైతులకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు తెలిపారు. సర్పంచు బొర్రు పూజిత, ఆర్ఐ శాంతి ప్రియ, మండల సర్వేయర్, నాయకులు బొర్రు రాము, రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి పరామర్శ



మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న పవన్‌కుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇందుకూరుపేట అరుంధతి వాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన చల్లగుండ్ల శ్రీనివాసులు, లక్ష్మీ దంపతుల మృతదేహాలకు గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు ఏకొల్లు పవన్‌కుమార్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుమార్తె లక్ష్మీచందు, కుమారుడు విశ్వంత్‌లను ఓదార్చి స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈదూరు విజయకుమార్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కాకర్ల జన్మదిన వేడుకలు

ఉదయగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరిలో శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉదయం కేక్ కట్ చేయడంతోపాటు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 400 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లు వితరణ చేయడం జరుగుతుందన్నారు. అలాగే అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కావున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ఉదయగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పంటలు సాగుచేసిన రైతులు నెలాఖరులోపు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంట కొనుగోలు చేయాలన్నా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్ట పరిహారం పొందాలన్నా ఈ-పంట నమోదు చేసుకుని ఉండాలన్నారు.

ఘనంగా ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు

ఆత్మకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను గురువారం ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని టి ముస్తాపురంలో కొల్లి శ్రీనివాసులనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నేతలు కేక్ కట్‌చేసి పార్టీ కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు నీటిసంఘం ఉపాధ్యక్షుడు డేగా పెంచలరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	142
స్కిన్ చికెన్	252
స్కిన్‌లెస్	278

కోడిగుడ్ల ధర (100): 560

నేడు కార్పొరేషన్‌లో ఓపెన్ ఫోరం

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం ఓపెన్ ఫోరం ఏర్పాటు చేసినట్లు సీపీ హిమబిందు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అనుమతులు, మార్టిగేజ్ విడుదల, లేఅవుట్ రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు, అనుమానాలను నివృత్తి చేసేందుకు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ఫోరం నిర్వహిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యరగుడిపాటి వెంకటాచలం జయంతి నేడు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం తూర్పు రాజగోపుర నిర్మాణదాత యరగుడిపాటి వెంకటాచలం పంతులు జయంతి వేడుకలు శుక్రవారం జరుగుతాయని ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామికి చిత్రకూట ఉత్సవం జరుగుతుందని, భక్తులందరూ విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

ఇంటర్వ్యూ



క్యాన్సర్ విస్తరిస్తోంది

● అల్లీపురం పీహెచ్‌సీ వైద్యాధికారి హజరత్‌రెడ్డి

చెడు అలవాట్లకు బానిసలవడం వల్ల క్యాన్సర్ వ్యాధి బారినపడే ప్రమాదం ఉందని అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కొల్లి హజరత్ రెడ్డి అన్నారు. సమాజంలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని, జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాపాయమని తెలిపారు. పలు విషయాలపై ఆయన ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు.

? క్యాన్సర్ వ్యాధి విస్తరిస్తోందని ఎలా గుర్తించారు.

! ఇటీవల మేము ప్రభుత్వ ఆదేశానుసారం ఎన్‌సీడీసీడీ 3.0 కార్యక్రమం పేరిట సర్వే చేపట్టాము. అందులో పరీక్షలు చేయగా క్యాన్సర్ విస్తరిస్తోందని గుర్తించాము. ఈ పరీక్షలకు ముందుకురాని వారిలోనూ ఉన్నట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

? ఈ పరిస్థితికి కారణం ఏమిటి.

! చెడు అలవాట్లే ప్రధాన కారణం. గుట్కా, సిగరెట్, నోటి శుభ్రత లేకపోవడం వంటివి ప్రధాన కారణాలు. వీటి వల్లే దాదాపుగా క్యాన్సర్ శరీరంలోకి ప్రవేశిస్తుంది. వైద్య సిబ్బంది నిర్వహించే సర్వేల్లో పరీక్షలు చేయించుకుంటే ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి నయం చేయవచ్చు.

? పల్లెల్లోనూ షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది ఎందుకని.

! మద్యం, సిగరెట్, ఆహారంలో మార్పులు ప్రధాన కారణాలు. నాణ్యమైన ఆహారం తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పడిపోయింది. పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లోనూ చెడు తిండ్లు ఎక్కువయ్యాయి. పైగా శరీర వ్యాయామం తగ్గింది. అందువల్లే షుగర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు.

? క్యాన్సర్ వ్యాధిని నియంత్రించే మార్గం...

! ప్రస్తుతం ఎన్‌సీడీసీడీ 4.0 సర్వే మొదలైంది. ఇందులో కేవలం క్యాన్సర్ గుర్తింపు పరీక్షలే నిర్వహిస్తారు. ప్రతీ ఒక్కరు విధిగా పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు. అప్పుడు వైద్యం అందించడం సులువు, పైగా వ్యాధిని నియంత్రించవచ్చు.

? పీహెచ్‌సీల్లో కాన్పులకు ప్రజలు సుముఖత చూపడం లేదు ఎందుకని.

! గర్భవతులు, వారి కుటుంబీకుల్లో అవగాహన రావాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు సురక్షితమన్నది తెలుసుకోవాలి. ఇప్పుడు ప్రభుత్వ పీహెచ్‌సీల్లో అన్నీ సౌకర్యాలున్నాయి. అల్లీపురం పీహెచ్‌సీలో పరికరాలతోపాటు, సిబ్బంది పూర్తిగా అందుబాటులో ఉన్నారు.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

పరిశుభ్రత లేకుంటే జరిమానా

● నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పరిశుభ్రత లేని ప్రాంతాల్లో దుకాణాలు నిర్వహిస్తే జరిమానాలు విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. 22వ డివిజన్‌లో డ్రైనేజీ కాలువ పక్కన అపరిశుభ్ర వాతావరణంలో హోటల్ ప్రాంగణం ఉండటాన్ని గుర్తించిన ఆయన సదరు హోటల్ యజమానికి గురువారం రూ.5 వేలు జరిమానా విధించారు. ఇలాంటి ప్రాంతాలను శానిటేషన్ ఉద్యోగులు ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. గుడిపల్లిపాడు వద్ద అనుమతులు లేని నిర్మాణాలను ఆపేయాలని అధికారులను ఆదేశించారు. సిరిగార్డెన్స్‌లో పర్యటించిన ఆయన పారిశుధ్య పనులను మెరుగుపరచాలని సిబ్బందికి సూచించారు. స్టోన్‌హౌస్‌పేటలోని కేవీసీ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని దుకాణదారులు నిర్ణీత సమయంలోపు అద్దెలు చెల్లించాలని, లేకపోతే దుకాణాలు మూతేస్తామని హెచ్చరించారు. రామలింగాపురం అండర్‌బ్రిడ్జి వద్ద జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైకస్‌రోడ్డు వద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 1వ నెంబరు షాపుదారుడు 2020 నుంచి సుమారుగా రూ.15.05 లక్షలు బాకీ ఉండటంతో సదరు షాపును రెవెన్యూ అధికారులు మూసేశారు.



కార్మికుడితో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

కారుణ్య నియామకం చేపట్టండి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు వినతి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విధులు నిర్వహిస్తూ రైలు ప్రమాదంలో మృతి చెందిన హెల్త్ అసిస్టెంట్ నక్కా రాంకుమార్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కేటాయించాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు రాంకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేట్లు, కుటుంబ సభ్యులలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చేటట్లు చూస్తామని డీఎంహెచ్‌వో హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు, బాధితులు ఏవో నిషాంత్‌రెడ్డిని కలిసి సాయం కోరారు. హంస నెల్లూరు సిటీ అధ్యక్షుడు గౌస్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, అదనపు కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న సుధాకర్


రోడ్డు పనులకు పరిహార పోటు

- పలువురు భవన యజమానులు కోర్టుకు...
- ఆలస్యం అవుతున్న రోడ్డు విస్తరణ
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పరిహారం కోసం యజమానులు కోర్టుకు వెళ్లడంతో నిలిచిన భవనాలు

నెల్లూరు(వెంకటేశ్వరపురం) సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పెన్నా నదిపై నూతన వంతెనతోపాటు ఇనమడుగు వద్ద జాతీయ రహదారి వరకు రెండు వైపుల రోడ్డు విస్తరణ పనులు తీవ్ర ఆలస్యం అవుతున్నాయి. నెల్లూరు నగరానికి రాకపోకలు సాగించడంతోపాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పెన్నా నదిపై నూతన వంతెన, రోడ్డు విస్తరణ పనులను కొంతకాలం క్రితం చేపట్టారు. వంతెన నిర్మాణం ఇప్పటికే 90 శాతం పూర్తయింది. పడుగుపాడు వరకు రోడ్డు పనులు పూర్తి చేశారు. కానీ వెంకటేశ్వరపురం కూడలి పరిసరాల్లో మాత్రం పనులు నిలిచిపోయాయి. ఆ ప్రాంతంలో 40 ఏళ్ల క్రితం పట్టాలు పొంది పన్నులు చెల్లిస్తున్న స్థలాలు, భవనాలకు పరిహారం ఇవ్వకుండా రోడ్డు విస్తరణ చేపట్టడాన్ని ఆక్షేపిస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీంతో వారి భవనాలు తొలగించలేదు. అయితే మిగతా వారి దుకాణాలు, నివాసాలు తొలగించి ఇష్టానుసారంగా తవ్వేశారు. ఉన్న దుకాణాలు కూల్చడం, రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కోర్టుకు వెళ్లిన వారితో సంబంధిత అధికారులు చర్చించి వారికి న్యాయం చేసి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.



పెన్నా నదిపై పూర్తి కావస్తున్న వంతెన నిర్మాణం

దుకాణాలకు పరిహారం కుదరదు

నివాసాలు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ స్థలంతోపాటు నష్ట పరిహారం అందజేశాము. ఇనమడుగు నుంచి శెట్టిగుంటరోడ్డు వరకు ఇదే విధంగా నిర్వాసితులకు పరిహారం అందజేశాము. దుకాణాలు నిర్మించుకుని వ్యాపారాలు చేస్తున్న వారికి భూమి ఇచ్చాము. కానీ పరిహారం ఇవ్వలేదు. ప్రభుత్వ చట్టంలో పరిహారం ప్రస్తావన లేదు. కోర్టుకు వెళ్లిన వారితో కాంట్రాక్టర్ చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే తెలియజేశాము.

- అనూష, ఆర్డీవో నెల్లూరు

సుఖవ్యాధులు, మాదకద్రవ్యాలపై అవగాహన

డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హెచ్ఐవీ, సుఖ వ్యాధులు, మాదక ద్రవ్యాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రచార రథం గురువారం నెల్లూరు నగరానికి చేరుకుంది. దానికి డీఎంహెచ్‌వో పచ్చ జెండా ఊపారు. జిల్లాలో 15 రోజులపాటు ఈ రథం ఉంటుందని తెలిపారు. జిల్లా క్షయ,ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ చాలా తక్కువగా ఉందన్నారు. కొత్త కేసులు రాకుండా యువతకు, ప్రమాదకర ప్రవర్తనతో జీవిస్తున్న వారికి మరింత అవగాహన కలిగిస్తామని వెల్లడించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు వ్యాధి నివారణకు సహకరించాలని కోరారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో తదితరులు

ప్రాణాలు తీస్తున్న ఇసుక బకాసురులు

● సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగం మండలం పెరమన వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందటం బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుక బకాసురుల కారణంగా ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.10 లక్షల నష్టపరిహారం, ప్రమాదానికి కారణమైన వారి నుంచి మరో రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని కోరారు.

'నారాయణ'లో ఫార్మకో విజిలెన్స్ వేడుకలు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నారాయణ వైద్య కళాశాలలో గురువారం 5వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ దినోత్సవ వేడుకలు జరిగాయి. డాక్టర్ బీసీ రాయ్ లెక్చర్ గ్యాలరీలో కామన్ అకడమిక్ ప్రోగ్రామ్‌లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లి దొరసానమ్మ ప్రారంభించారు. ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ మాధవులు మాట్లాడుతూ ఫార్మకో విజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా వైద్యరంగంలో కీలక పాత్రపై వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణచైతన్య, వైద్యులు, మెడికోలు పాల్గొన్నారు.



ఫార్మకో విజిలెన్స్ వీక్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైద్య నిపుణులు, మెడికోలు

అధికారులు సమన్వయంతో పని చేయాలి : ఆర్డీవో అనూష

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ పార్టీల నాయకులతో బీఎల్‌వోలు సమన్వయం చేసుకొని ఓటరు పరిశీలన చేయాలని నెల్లూరు ఆర్డీవో అనూష పేర్కొన్నారు. ఆమె కార్యాలయంలో గురువారం నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని రాజకీయపార్టీల నాయకులు, బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే 58 పోలింగ్ స్టేషన్లు మార్పు చేసినట్లు తెలిపారు. నూతనంగా వచ్చిన బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల నాయకులతో త్వరలో నే అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో కార్యాలయ ఏవో నిర్మలానందబాబా, రూరల్ నియోజకవర్గ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్ ఆధునీకరణ పనులు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజల విజ్ఞప్తి మేరకు బుజబుజ నెల్లూరులో విద్యుత్ సరఫరాలో సమస్యలను అధిగమించేందుకు రూ.1.50 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టినట్లు టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం సంబంధిత అధికారులతో కలిసి ఆ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బద్దేపూడి నరసింహగిరి, నాయకులు జెన్నీ రమణయ్య, శేషు యాదవ్, మాతంగి కృష్ణ, నగళ్ల రాములు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై కేసులు ఎత్తి వేయాలి

● శాసనసభలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ సిబ్బందిపై పెట్టిన కేసులను ఎత్తేయాలని శాసనసభలో గురువారం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేయడం, 4687 హెల్పర్ల నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వటం హర్షదాయకమన్నారు. ఫేస్ యాప్, అవుట్ లొకేషన్ విధానాల్లో సాంకేతిక సమస్యలతో అంగన్‌వాడీలు సమస్యలు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తెచ్చారు.

విధుల్లో అలసత్వం సహించను : ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల హెచ్చరించారు. గురువారం ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లోని ఆయుధాల గది, ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆమె సందర్శించారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆయుధాల గది, స్టోర్ రూమ్, అడిషనల్ ఎస్పీ ఏఆర్, ఆర్ఐ అడ్మిన్, ఆర్ఐ వెల్ఫేర్ గదులతో పాటు ఇంటిగ్రేటెడ్ పోలీస్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఆయుధాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా నగరంలో చిన్నబజారులోని బీజేపీ కార్యాలయంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీ వరకు దేశంలో ఉన్న హెల్త్ సెంటర్స్‌లో ఉచితంగా మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేస్తారని తెలిపారు. మహిళలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు హేమంత్, పెంచలయ్య, బాలాజీ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

నెల్లూరు (లీగల్), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హిమాన్షు శుక్లా, జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్‌ను గురువారం మధ్యాహ్నం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ను జిల్లా జడ్జి అభినందించారు.



అవును.. అక్రమ తరలింపే!

(5వ పేజీ తరువాయి)

ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు. ఈ డాన్‌తోపాటు స్థానిక ప్రజాప్రతినిధి అనుచరుడైన ఏఎస్‌పేట మండలానికి చెందిన ఓ నేత ఇందులో భాగస్వామ్యం ఉన్నట్లు సమాచారం. బుధవారం ప్రమాదానికి కారణమైన టిప్పర్ కూడా ఆ నేత పేరుతోనే రిజిస్ట్రేషన్ అయి ఉంది. సదరు నేత ఇటీవల ఎనిమిది టిప్పర్లు కొనడంతో ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. అయితే, తెర వెనుక ఓ ప్రజాప్రతినిధి ఉండటంతో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● ముగ్గురిపై కేసు నమోదు

ఎస్పీ అజిత ఆదేశాలతో సంగం పోలీసులు బుధవారం అర్ధరాత్రి పెరమన ఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేశారు. టిప్పర్ డ్రైవర్‌తోపాటు టిప్పర్ యజమాని, ఇసుక మాఫియా నడిపిస్తున్న డాన్ పైనా కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే ఘటనాస్థలిలో ఉన్న టిప్పర్, కారును క్రేన్ల సహాయంతో పోలీసుస్టేషన్‌కు తరలించారు.



క్రేన్ సాయంతో స్టేషన్‌కు తరలుతున్న కారు

కలెక్టర్‌తో ఏపీఆర్ఎస్ఏ నాయకుల భేటీ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు గురువారం నూతన కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా నగరంలో చిన్నబజారులోని బీజేపీ కార్యాలయంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీ వరకు దేశంలో ఉన్న హెల్త్ సెంటర్స్‌లో ఉచితంగా మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేస్తారని తెలిపారు. మహిళలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు హేమంత్, పెంచలయ్య, బాలాజీ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించండి

● విద్యుత్ జేఏసీ రాష్ట్ర నాయకుడు అల్తాఫ్



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విద్యుత్ జేఏసీ రాష్ట్ర నాయకుడు షేక్ అల్తాఫ్ డిమాండ్ చేశారు. నెల్లూరు సర్కిల్ ఆఫీస్ వద్ద గురువారం విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజేషన్, పీఆర్‌సీ బకాయిలు, ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రమోషన్లు, డీఏలు వంటి అన్ని డిమాండ్లు తక్షణమే నెరవేర్చాలన్నారు. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పీ దామోదర్, శ్రీనివాసులు, నజీర్ ఖాన్, వెంకటేశ్వర్లు, రఫీ, నవాబ్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్‌లో సన్మానం

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని విద్యుత్ భవన్‌లో గురువారం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందిన అల్తాఫ్ బాషాను సన్మానించారు. ఏపీ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ ముస్లిమ్స్ మైనార్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నాయకుడు ఏడీ ఖాదర్ బాషా, జేఏవో రఫీ, యూనియన్ నగర అధ్యక్షుడు లతీఫ్, సెక్రటరీ జమీర్ తదితరులు పాల్గొన్నారు.



కసుమూరు గంధోత్సవంలో కిక్కిరిసిన భక్తులు

వెంకటాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మస్తాన్ వలి 248వ గంధమహోత్సవం సందర్భంగా కసుమూరు గురువారం భక్తులతో కిక్కిరిసింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దర్గాను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. దర్గాతోపాటు బంగళా వద్ద దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **వర్షంతో ఇబ్బందులు**

గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భక్తులు తలదాచుకోవడానికి అగచాట్లు పడ్డారు. కూర్చోవడానికి కూడా వీలు లేక తంటాలు పడ్డారు. వర్షం పడడంతో కసుమూరు దర్గా ప్రధానమార్గం, పరిసరాలు, గంధమహోత్సవం ప్రారంభమయ్యే చందన్‌మహల్ (బంగళా) ప్రాంగణమంతాట బురదమయమైపోయింది. ఆ చిత్తడితో భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. తిరిగేందుకు భక్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

● **అధికారుల వైఫల్యం**


గంధమహోత్సవం ఏర్పాట్లు చేయడంలో వక్ఫ్‌బోర్డు అధికారులు విఫలమయ్యారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. బంగళా వద్ద నామమాత్రంగానే షామియానాలు ఏర్పాటు చేశారు. దీంతో బురదమయమైన నేలపైనే పట్టలు వేసుకుని సేదతీరారు. కనీసంచలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. అవసరం ఉన్నచోట్ల మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



కసుమూరులో భక్తులతో కిక్కిరిస్తున్న దర్గా ప్రధానమార్గం

ఏఎస్‌పేటలో గంధమహోత్సవ ఏర్పాట్లు

ఏఎస్‌పేట,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి):శ్రీహజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా 252వ గంధమహోత్సవాన్ని గురువారం అర్ధరాత్రి నిర్వహించడానికి అన్ని సిద్ధం చేశారు. వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేశారు.దర్గా దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు, అన్నదానం,తాగునీరు,ప్రత్యేక వైద్య శిబిరం, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దర్గాలోని సమాధుల దర్శనానికి భక్తులు పోటెత్తారు.దర్గా పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.దర్శనం కోసం క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ప్రత్యేకంగా విద్యుత్‌దీపాలతో దర్గాను అలంకరించారు. కాగా గురువారం మహల్‌లో దర్గా ఈవో మహమ్మద్ హుసేన్,దర్గా సజ్జాద షాగులాం నక్షబంద్ ఫయాజ్,పలువురు నాయకులు, అధికారులు గంధం దంచే కార్యక్రమన్ని ప్రారంభించారు.అనంతరం మహిళ భక్తులు గంధం దంచారు. కాగా సెల్‌ఫోన్ సిగ్నెల్స్ అందక భక్తులు ఇబ్బంది పడ్డారు.



విద్యుత్ దీపాలంకరణలో నాయబ్ రసూల్ దర్గా

జాతీయ ఎన్‌సీసీ శిబిరానికి అభిషేక్

● ముస్పిపల్ పాఠశాల విద్యార్థికి అభినందన



కేడెట్ అభిషేక్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు మంజుల

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్ జాతీయ స్థాయి ఎన్‌సీసీ క్యాంప్‌నకు నెల్లూరులోని వెంగళరావునగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల పదో తరగతి విద్యార్థి వీ అభిషేక్ పాల్ ఎంపికయ్యాడు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సీ మంజులవాణి మాట్లాడుతూ తమ విద్యార్థి 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ కేడెట్‌గా జాతీయ శిబిరానికి ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. నంద్యాలలో శనివారం నుంచి జరిగే ఈ శిబిరంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచారాలు, భాషలు, జీవనశైలి, జాతీ య సమైక్యత, సమగ్రత తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, ఉపాధ్యాయులు, కేడెట్స్ పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయంలో బూతు పురాణం

దుత్తలూరు(ఉదయగిరి), (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో గురువారం ఇద్దరు ఉద్యోగులు ఒకరితో ఒకరు బూతు పురాణంతో తిట్టుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. కార్యాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కన్సల్టెంట్ హజరత్తయ్య, సాంకేతిక సహాయకుడు సునీల్ ఒక పనికి సంబంధించి ఎంబుక్ తయారీలో తీవ్రస్థాయిలో తిట్టుకుంటూ వాగ్వివాదానికి దిగారు. సమీపంలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్న విషయాన్ని సైతం మరిచి ఒకరికొకరు రెచ్చిపోయారు. అక్కడే ఉన్న ఏపీవో బ్రహ్మయ్య వారిని ఎంత సముదాయించినా వారు పట్టించుకోలేదు. వారి తిట్ల దండకంతో చుట్టుపక్కల కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలు సైతం అవాక్కయ్యారు.



సంగం సమీపంలోని పెరమన వద్ద జరిగిన ప్రమాదంలో టిప్పరు నుంచి కారును తొలగిస్తున్న క్రేన్ (ఫైల్)

ఇటీవల జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నవారి సంఖ్య పెరుగుతూ ఉంది. బుధవారం సంగం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. రహదారి ప్రమాదాల్లో కుటుంబాలు ఛిద్రమవుతున్నా వీటిని అరికట్టడంలో అన్నీ శాఖల అధికారులు విఫలమవుతున్నారు. అధికారుల సమన్వయం పేరుతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ, ప్రమాదాల నివారణకు రూపొందిస్తున్న కార్యాచరణ మాటలకే పరిమితం అవుతోంది.

\- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

సమీక్షలతో సరి.. కార్యాచరణ ఏదీ!?

- 'బ్లాక్ స్పాట్'లలో కానరాని చర్యలు
- హైవేపై ఇష్టానుసారంగా ఫుడ్ కోర్టులు, డాబాలు
- మద్యం, నిద్రమత్తులో ప్రమాదాలు
- రక్తమోడుతున్న రహదారులు
- ప్రమాదాల నివారణలో అధికారుల వైఫల్యం

జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతి వేగం, నిద్రమత్తు, మద్యం సేవించి వాహనం నడపడంతోపాటు రోడ్డు పక్కన ఇష్టానుసారంగా వాహనాలను ఆపడమే. దీనికితోడు జాతీయ రహదారుల వెంట ఇటీవల కాలంలో ఫుడ్ కోర్టులు, డాబాలు, బార్లు, మద్యం దుకాణాలు పెరిగాయి. రోడ్లకు పక్కనే చిన్నపాటి బంఢ్లు, షెల్టర్‌లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తుండడతో వాహణాలు హైవేపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఈ అంశాలపై దృష్టి సారించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● **ఐదేళ్లలో...**

2020లో జిల్లాలో 943 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 398 మంది మరణించారు, 944 మంది క్షతగాత్రులయ్యారు. 2021లో 977 ప్రమాదాలు జరగ్గా, 466 మంది మృతిచెం ది, 1006 మంది క్షతగాత్రులయ్యారు. 2022లో 884 ప్రమాదాలు జరగ్గా, 368 మంది మృతి చెంది, 974 మంది క్షతగాత్రులయ్యారు. 2024లో 828 ప్రమాదాలు జరగాయి. 450 మంది మృత్యువాత పడగా, 905 మంది క్షతగాత్రులయ్యారు. 2022లో ఇప్పటి వరకు 663 ప్రమాదాలు జరగ్గా, 384 మంది మృతి చెందారు, 645 మంది క్షతగాత్రులయ్యారు.

● **రెస్ట్ ఏరియాలు ఉన్నా..**

నెల్లూరు-బద్వేలు రోడ్డులో రెండు, ఏర్పేడు-రాపూరు జాతీయ రహదారిలో రెండు, పోర్టుకు వెళ్లే రూట్‌లో ఒకటి, వెంకటాచలం వద్ద, ఆత్మకూరుకు వెళ్లే దారిలోనూ.. ఇలా జాతీయరహదారిపై వాహనాలను నిలిపేందుకు ప్రత్యేకంగా రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేశారు. అయితే వాహనదారులు వాటిని పెద్దగా ఉపయోగించడం లేదు. గౌరవరం, వెంకటాచలం ప్రాంతాల్లో మాత్రం రెస్ట్ ఏరియాలను వాహనదారులు కొంత మేరకు వినియోగిస్తున్నారు. రెస్ట్ ఏరియాల్లో కాకుండా ఇష్టానుసారంగా జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం ద్వారా, బ్రేక్‌డౌన్ అయిన వాహనాలను రోడ్లోనే ఉంచి రిపేర్లు చేయడం ద్వారా వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీ కొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

● **అనుభవం లేకుండా...**

కరోనా తర్వాత ఇంటికో కారు అన్నట్లుగా పరిస్థితులు ఏర్పడాయి. ఫైనాన్స్ కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి తక్కువ డౌన్ పేమెంట్‌కు కార్లను డెలివరీ ఇచ్చేస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు సొంత కార్లు, బంధువుల వద్ద ఉండే కార్లలో శుభ, అశుభ కార్యాలకు ప్రయాణాలు చేస్తున్నారు. జాతీయ రహదారిపై, దూరప్రాంతాలకు కార్లు నడిపేవారు అనుభవం లేకున్నా వచ్చి రానీ డ్రైవింగ్‌తో కారు స్టీరింగ్ పట్టుకొని రోడ్డుపైకి వెళుతున్నారు. దీంతో వేగాన్ని నియంత్రించలేక, వాహనాల రద్దీలో వాహనం నడిపే నైపుణ్యం లేకుండా, అధిక సమయం నిద్ర మేలుకొని ప్రమాదాల బారిన పడుతున్నారు.

● **బ్లాక్‌స్పాట్‌లపై కానరాని దృష్టి**

మూడు క్యాలెండర్ సంవత్సరాల్లో ముగ్గురు కంటే ఎక్కువ గా ఒకే ప్రాంతంలో మం`ణించి ఉంటే, ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్ గా గుర్తిస్తారు. ఇక్కడ ప్రమాదాల నివారణతోపాటు ప్రమాదాలను తగ్గించడం కోసం జిల్లా రహదారి భద్రతా మం డలి సమావేశం ఏర్పాటు చేసుకొని, నివారణ చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేస్తారు. అయితే ఈ ప్రణాళికలను పాటించడంలో అన్నీ శాఖలు విఫలమవుతున్నాయి. వాహనాల స్పీడ్‌ను తగ్గించలేకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని అదుపు చేయకపోవడం, రోడ్డుకు పక్కనే నిలిపే అక్రమ పార్కింగ్‌ను అడ్డుకోవడం, బ్లాక్ స్పాట్‌లలో నిరంతరం పోలీసు సిబ్బంది ఉండక పోవడం, తదితర నివారణ చర్యలపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఇక జాతీయ రహదారి సిబ్బంది వారి పనులు వారు చూసుకోవడానికే సమయం లేదన్న మాటలు వినిపిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణపై అన్నీ శాఖలు దృష్టి సారిస్తే, ప్రమాదాల సంఖ్య తగ్గుతుంది.



బోగోలు కార్యదర్శిపై చర్యలకు సిఫార్సు

● **సర్పంచికు షోకాజ్ నోటీస్ జారీ**

కావలి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి) కావలి డివిజన్‌లోని బోగోలు గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఆ పంచాయతీ కార్యదర్శి షేక్ అబ్దుల్ జహీర్‌పై క్రమశిక్షణా చర్యలకు పంచాయతీరాజ్ కమిషనర్‌కు సిఫార్సు చేసినట్లు డీపీవో శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సర్పంచి పీ. అనిత చెక్‌పవర్‌ను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ కోరుతూ షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆ పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగాయని, మద్దిబోయిన వీరరఘు, ప్రస్తుత పాలకవర్గ సభ్యులు గతంలో అధికారులకు ఫిర్యాదు లు చేశారు. ఈ ఫిర్యాదులపై కావలి డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శిగా అబ్దుల్ జహీర్ డ్రాచేసిన నిధుల్లో రూ.30 వేలు దుర్వినియోగం అయ్యాయని తేలింది. అలాగే రూ.33,49,035లు అభ్యంతర ఖర్చు చేయటంతోపాటు పలు అవకతవకలు జరిగాయని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోనున్నట్లు డీపీవో పేర్కొన్నారు.

'విజయ'లో ఎన్నికల కోలాహలం

● డైరెక్టర్ల పోస్టులకు మూడింటికి నోటిఫికేషన్ ● నెలాఖరుతో ముగుస్తున్న కొండ్రెడ్డి పదవీకాలం ● చైర్మన్ రేసులో పలువురు బోర్డు డైరెక్టర్లు



నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితి(విజయ డెయిరీ)లో మూడు డైరెక్టర్ పోస్టుల ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల అధికారి బీ. హరిబాబు నిర్వహణ బాధ్యతలు చేపడుతూ నోటిఫికేషన్ విడుదల చేశారు. విజయడెయిరీ పాలకవర్గంలో 15 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ప్రతి ఏటా ముగ్గురు సభ్యుల పదవీకాలం రొటేషన్ పద్ధతిలో ముగుస్తుంది. ఈ క్రమంలో ఈనెలాఖరుకు ప్రస్తుత చైర్మన్, అల్లూరు మండలం నార్త్‌మోపూరు పాలసొసైటీ సభ్యుడు కొండ్రెడ్డి రంగారెడ్డి, బాలాయపల్లి మండలం వెంగమాంబపురం సొసైటీ సభ్యురాలు సూదలగుంట సాయినిరోషా, కోవూరు మం డలం మోడెగుంట పాలసొసైటీ సభ్యురాలు క న్నా ఇందిరమ్మ పదవీకాలం ముగియనున్నది.

● **22న నామినేషన్**

ఈ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు ఈనెల 22న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగం ట వరకు నామినేషన్‌లు స్వీకరిస్తారు.అదే రోజు మధ్యాహ్నం నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. 23న సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అభ్యర్థుల మధ్య పోటీ ఉంటే ఈనెల 27న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం ఓట్లు లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుంది.

● **చైర్మన్ రేసులో పలువురు డైరెక్టర్లు**

విజయడెయిరీ చైర్మన్‌గా ఇప్పటివరకు ఉన్న వైసీపీకి చెందిన కొండ్రెడ్డి రంగారెడ్డి పదవీకాలం ఈనెలాఖరుతో ముగియనున్నది. కాగా ఈ పదవికి టీడీపీకి చెందిన పలువురు బోర్డు సభ్యులు పోటీ పడుతున్నట్లు సమాచారం. అయితే ఖాళీ అవుతున్న మూడు స్థానాల్లో ఎవరిని పోటీ చేయించాలి.ఫలితాల అనంతరం మొత్తం బోర్డు సభ్యులు 15 మందిలో చైర్మన్ పదవి ఎవరికి కట్టబెట్టాలన్న విషయంపై టీడీపీ అధిష్ఠానం ఇప్పటికే దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రధానంగా ఇద్దరు డైరెక్టర్ల మధ్య పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరివైపు మొగ్గు చూపుతారో వేచి చూడాలి.

బంగారు నగలు దొంగలించిన మహిళల అరెస్టు

పొదలకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా నుంచి వచ్చి పొదలకూరు పట్టణంలోని పలు బంగారు దుకాణాల్లో వస్తువులను కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ నగలను కాజేసిన మహిళలను వ్యాపారస్తులు గుర్తించి గురువారం పోలీసులకు అప్పగించారు. కృష్ణాజిల్లాకు చెందిన జ్ఞానమ్మ, ఆదెమ్మలు మరో మహిళతో కలిసి పొదలకూరులోని వివిధ దుకాణాల్లో సుమారు రూ.2 లక్షల విలువ చేసే 7 జతల కమ్మలు దొంగిలించారు. పలు దఫాలుగా జరిగిన ఈ దొంగతనాన్ని గుర్తించకపోవడంతో మరోమారు దొంగిలించేందుకు వచ్చిన వీరిని బంగారు దుకాణ వ్యాపారస్తులు చాకచక్యంగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ముగ్గురిలో ఒకరు తప్పించుకోగా జ్ఞానమ్మ, ఆదెమ్మలపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పిడుగుపాటుకు ఒకరికి గాయాలు

వెంకటాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో గురువారం పిడుగుపాటుతో సుమారు రూ. 80 వేల విలువ గల ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన కోటయ్య, కరయ్య ఇళ్లపై పిడుగు పడింది. దీంతో ఈ రెండు ఇళ్లల్లోని ఎలక్ట్రికల్ వస్తువులతోపాటు ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో వెంకటేష్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. దుత్తలూరు మండలంలోని వెంకటంపేట గ్రామ సమీపంలోని ఓ మలుపు వద్ద మోపె డ్ వాహనం బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మర్రిపాడు మండలం ఇస్కపల్లి గ్రామానికి చెందిన వెంకటనరసింహం(50) పని నిమిత్తం ఉదయగిరికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈ తరుణంలో వెంకటంపేట మలుపు వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అటుగా వస్తున్న వాహనదారులు గమనించి 108 వాహనానికి సమాచా రం ఇవ్వడంతో వారు వచ్చేసరికి మృతిచెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.



వింజమూరు : మృతిచెందిన ట్యాంకర్ డ్రైవర్



సంగం : రోడ్డుప్రమాదంలో మృతి చెందిన గార్ల వెంకటేశ్వర్లు

● **కల్వర్టును ఢీకొని..**

వింజమూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యో తి): మండలంలో ఊటుకూరు సమీపంలో కల్వర్టును ఢీకొని మినీ డీజల్ ట్యాంకర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పో లీసులు తెలిపారు. బద్వేల్ నుంచి మినీ డీ జిల్ ట్యాంకర్ మండలంలోని క్లస్టర్ దగ్గర కు వస్తూ ఊటుకూరు సమీపంలో రాగానే ప్రమాదవశాత్తు కల్వర్టును ఢీకొనగా ట్యాంకర్ ముందుభాగం దెబ్బతిన్నడంతో డ్రైవర్ నవీన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడని తెలిపారు. మృతుడు నవీన్ (24)కు భార్య, పసిబిడ్డ ఉన్నారు. కలిగిరి సీఐ వెంకటరమ ణ స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన సమాచారాన్ని తెలుసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● **ట్రాక్టర్‌ను ఢీకొని..**

సంగం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘ టన మండల పరిధిలోని సిద్దీపురం వద్ద ముంబాయి జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగింది. వివరాల మేరకు... కొండా పురం మండలం వెలిగొండ్ల గ్రామానికి చెంది న గార్ల వెంకటేశ్వర్లు (50) మోటార్‌బైక్‌పై నెల్లూరు వెళ్తూ మార్గమధ్యంలో సిద్దీపురం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్ తొట్టెను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో అత నికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108కి సమాచారం అందించారు. వారు వచ్చి పరీక్షించగా అప్పటికే మృతిచెందాడు. ఈమేర కు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లెక్కింపునకు నోచని హుండీలు

● దర్గాలో గుట్టలుగా పడి ఉన్నవైనం ● భక్తుల ప్రదక్షిణకు ఇక్కట్లు ● సుమారు రూ.3 కోట్ల నగదు ఉండవచ్చని అంచనా

ఏఎస్‌పేట,సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఆ దర్గాలోకి వెళ్లగానే గుట్టలు, గుట్టలుగా దుప్పట్లు, పట్టలు కప్పిన హుండీలు దర్శనమిస్తాయి. వీటిని చూసి భక్తులు అవాక్కవుతున్నారు. దర్గాలో సమాధులు దర్శించుకోవాలని వస్తే .. ఇలా హుండీలు కనిపిస్తున్నాయని, వీటిని ఇలా ఎందుకు వదిలేశారని భక్తులు చర్చించుకుంటున్నారు. ఏఎస్ పేటలోని హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గాను సుమారు మూడేళ్ల క్రితం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధీనంలోకి తీసుకుంది. వక్ఫ్ బోర్డు ఆధీనంలోకి తీసుకున్నాన 11నెలలకు మొదటిసారి హుండీలు లెక్కించారు. ఆ సమయంలో రూ. 1,60,000 నగదు వచ్చింది. ఈ క్రమంలో హుండీలలో తనకు వాటా కావాలని మాజీ ముతవలి కోర్టుకు వెళ్లారు. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు హుండీల లెక్కింపు జరగలేదు.

● **ఆగిన లెక్కింపు**

దర్గాలోకి వెళ్లే ప్రధాన ద్వారం దగ్గర,లోపల సమాధుల వద్ద, పురుషుల మసీదు ద్వారం దగ్గర, మహిళల మసీదు ద్వారం వద్ద , దర్గా వెలుపల జెండా వద్ద... ఇలా మొత్తం ఐదు హుండీలను ఏర్పాటు చేశారు. ఈ ఐదు హుండీల ద్వారా సుమారు రూ.1,60,000 నగదు వస్తే.. అందులో ప్రధాన ద్వారం, సమాధుల వద్ద ఉన్న రెండు హుండీల ద్వారా సుమారు రూ.1,33,000 ఆదాయం వచ్చింది.ఈ రెండు హుండీలను తనకు కేటాయించాలని మాజీ ముతవల్లి కోర్టుకు వెళ్లారు.దీంతో హుండీల లెక్కింపు ఆగిందని దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ తెలిపారు.





దర్గాలో పట్టలు, దుప్పట్లు కప్పి ఉన్న హుండీలు

● **ఎక్కడ చూసినా హుండీలే...**

సుమారు 19 నెలలుగా హుండీలు లెక్కించకపోవడంతో సుమారు 19 హుండీలు నిండాయి. వాటిని దర్గాలోనే ఒక పక్కగా ఉంచి, వాటిపై దుప్పట్లు,పట్టాలు కప్పి భద్రపరిచారు.ప్రస్తుతం దర్గాలో మరో ఐదు హుండీలు ఏర్పాటు చేసి ఉన్నారు.అవి అమ్మవారు గంధమహోత్సవ సమయంలో కొంతవరకు నిండాయి.గురువారం నుంచి జరిగే నాయబ్ రసూల్ గంధమహోత్సవంతో పూర్తిగా నిండనున్నాయి. దీంతో ఇంకా హుండీలు ఎక్కువ అవుతాయి. ఈ క్రమంలో దర్గా మొత్తం హుండీలే దర్శనం ఇస్తాయని భక్తులు అంటున్నారు.

● **రూ. 3 కోట్లు ఉండవచ్చు..**

ఇప్పటి వరకు నిండిన హుండీలలో సుమారు రూ. 3కోట్లు ఉండవచ్చని అంచనా. గంధ మహోత్సవం అనంతరం నిండే హుండీల ద్వారా మరో రూ. కోటి వరకు రావచ్చని అంచనా వేస్తున్నారు.దర్గా అభివృద్ధి కోసం భక్తులు హుండీలలో వేసిన కానుకలు ఉపయోగం లేకుండా ఇలా నిల్వ చేయడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.దీనికితోడు దర్గా లోపల భక్తులు ప్రదక్షిణలు చేయడానికి ఉండే కొద్ది స్థలాన్ని హుండీలు ఆక్రమించడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆత్మకూరు
ఉదయగిరి



రైతులకు యూరియా పంపిణీ

వింజమూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో మేకల రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



2003 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు

వింజమూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలు పరి ష్కరించాలని కోరుతూ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు గురువారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సానుకూలంగా స్పందించి ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు మాల కొండయ్య, మాల్యాద్రి, చిన్నబాబు, సుధీర్, వీరరాఘవులు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కాకర్ల జన్మదిన వేడుకలు

ఉదయగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరిలో శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉదయం కేక్ కట్ చేయడంతోపాటు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 400 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లు వితరణ చేయడం జరుగుతుందన్నారు. అలాగే అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కావున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

మహిళలకు వైద్య పరీక్షలు

ఉదయగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లిలో గురువారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 101 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని గండిపాళెం పీహెచ్‌సీ పరిధిలోని మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి శివకల్పన సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **వింజమూరు:** మండలంలోని కాటేపల్లి పంచాయతీ కాటేపల్లి గ్రామంలో గురువారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో చాకలికొండ పీహెచ్‌సీ డాక్టర్ మురళీధర్, సీహెచ్‌సీ సక్కు బాయమ్మ, పీఎస్ నరసింహారెడ్డి, హెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు, కాటేపల్లి పంచాయతీ అధ్యక్షుడు ఉప్పు టూరి వెంకటరత్నం, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీ మెరుగైన సేవలు : డీఎం

ఆత్మకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం అని ఆత్మకూరు డిపో మేనేజర్ ఎం శివకేశవ్‌యాదవ్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రయాణికులు పలు సమస్యలను తమ దృష్టికి తెచ్చారని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు

ఆత్మకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను గురువారం ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని టి ముస్తాపురంలో కొల్లి శ్రీనివాసులనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీజె పీ నేతలు కేక్ కట్‌చేసి పార్టీ కార్యకర్తలు, అభిమానులకు ప ంచిపెట్టారు. కార్యక్రమంలో ఏ ఎంసీ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు కుదు ముల సుధాకర్‌రెడ్డి, ఆత్మ కూరు నీటిసంఘం ఉపాధ్యక్షుడు డేగా పెంచలరెడ్డి, పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ఉదయగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉదయ గిరి వ్యవసాయ సబ్ డివి జన్ పరిధిలోని పంటలు సాగుచేసిన రైతులు నెలా ఖరులోపు ఈ-పంట నమో దు తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్‌చార్జి వ్యవ సాయ సహాయ సంచాల కులు పీ చెన్నారెడ్డి గురు వారం ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. పంట కొనుగోలు చేయాలన్నా, ప్రకృతి వైప రీత్యాలు సంభవించినప్పుడు పంట నష్ట పరిహారం పొం దాలన్నా ఈ-పంట నమోదు చేసుకుని ఉండాలన్నారు. కావున రైతులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



















రీసర్వేలో తప్పిదాలను సవరించాలని రైతుల ఆందోళన

ఉదయగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి రెవెన్యూ పరిధిలో భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలను సవరించాలని గురువారం జిల్లా రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. తహసీల్దారు కార్యాలయం లోపల తహసీల్దారు ఎదుట నేలపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండగానిపల్లి రెవెన్యూలో జరిగిన రీసర్వే అంతా గందరగోళంగా చేపట్టాన్నారు. దీంతో రైతులకు అడంగల్, 1బీ రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దారు రామ్మోహన్ రీసర్వేలో తప్పిదాలు జరిగిన రైతులు వివరాల జాబితాను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.


తహసీల్దారు కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలుపుతున్న వెంకటయ్య, రైతులు





అవును.. అక్రమ తరలింపే!

(5వ పేజీ తరువాయి)

ఆపార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు. ఈ డాన్‌తోపాటు స్థానిక ప్రజాప్రతినిధి అనుచరుడైన ఏఎస్‌పేట మండలానికి చెందిన ఓ నేత ఇందులో భాగస్వామ్యం ఉన్నట్లు సమాచారం. బుధవారం ప్రమాదానికి కారణమైన టిప్పర్ కూడా ఆ నేత పేరుతోనే రిజిస్ట్రేషన్ అయి ఉంది. సదరు నేత ఇటీవల ఎనిమిది టిప్పర్లు కొనడంతో ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. అయితే, తెర వెనుక ఓ ప్రజాప్రతినిధి ఉండటంతో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● ముగ్గురిపై కేసు నమోదు

ఎస్పీ అజిత ఆదేశాలతో సంగం పోలీసులు బుధవారం అర్ధరాత్రి పెరమన ఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేశారు. టిప్పర్ డ్రైవర్‌తోపాటు యజమాని, ఇసుక మాఫియా నడిపిస్తున్న డాన్ పైనా కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే ఘటనాస్థలిలో ఉన్న టిప్పర్, కారును క్రేన్‌ల సహాయంతో పోలీసు స్టేషన్‌కు తరలించారు.





రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

కావలి రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు ట్రంక్ రోడ్డులో గురువారం రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ రామిశెట్టి నవీన్‌కు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... కావలి నుంచి చేపల లోడుతో నెల్లూరు వైపు వెళ్తున్న లారీ ట్రంక్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా మరో వాహనం రోడ్డుపై చేరిన వర్షపు నీటిలో వేగంగా రావటంతో ఆ నీరు ఎగిరి చేపల లోడుతో వెళ్తున్న లారీలోని డ్రైవర్‌పై పడ్డాయి. దీంతో లారీని ఒక్కసారిగా ఆపటంతో కావలి నుంచి చంద్రబాబు కాలనీకి వెళ్తున్న ఆటో లారీ వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలయ్యాయి.

ఎస్సీ అట్రాసిటీ కేసులో రెండేళ్ల జైలు

ఉలవపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దళిత మహిళలను కులం పేరుతో దూషించి, దాడిచేసిన కేసులో ఒంగోలు 7వ ఏడీజే కోర్టు ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.1200 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. 2020 ఆగస్టు 8న కరేడుకి చెందిన యానాది కులానికి చెందిన మహిళ గేదెను మేత కోసం పొలానికి తోలుకెళ్లింది. ఈ క్రమంలో అదేగ్రామానికి చెందిన ముద్దాయి నక్కా రమేష్ (33) పొలం గట్టుపైన గేదెను తోలుకెళుతుండగా సదరు ముద్దాయి తన పొలంలో గేదెను మేపుతావా? అంటూ బాధిత మహిళను కులం పేరుతో దూషించడమే కాకుండా భౌతికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితరాలు తన కుమారుడితో కలిసి అదేరోజు ఉలవపాడు పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి కందుకూరు డీఎస్పీ కండే శ్రీనివాసరావు దర్యాప్తు చేసి చార్జిషీటు కోర్టుకు దాఖలు చేశారు. సాక్ష్యాలను పొందుపరిచారు. ఈ కేసుపై ఐదేళ్ల విచారణ అనంతరం ఒంగోలులోని 7వ ఏడీజే జడ్జి టీ రాజావెంకటాద్రి గురువారం ఈ మేరకు తీర్పు వెల్లడించారు. కేసును వాదించడంతో ప్రతిభ కనబరచిన స్పెషల్ పీపీ వై ప్రశాంతి కుమారి, కేసు విచారణ చేపట్టిన డీఎస్పీ కండే శ్రీనివాసరావు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లును ఎస్పీ డాక్టర్ అజిత వెజండ్ల అభినందించారు.

ఆవుల శ్రీనివాసులు హత్య కేసును ఛేదించిన పోలీసులు

● ఇరువురి అరెస్ట్... రిమాండ్‌కు తరలింపు

లింగసముద్రం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్లలో ఈనెల 9న జరిగిన ఆవుల శ్రీనివాసులు హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇరువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుడ్లూరు సీఐ జీ. మంగారావు గురువారం ఓ ప్రకటనలో కేసు వివరాలను వెల్లడించారు. శ్రీనివాసులు ఇంటి వరండాలో ఒంటరిగా నిద్రిస్తుండగా, అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీనివాసులును ఆయుధంతో బలంగా కొట్టి చంపారని ఆయన పెద్ద కుమార్తె మనీషా లింగసముద్రం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గుడ్లూరు సీఐ మంగారావు దర్యాప్తు చేపట్టారు. మృతుడు శ్రీనివాసులుకు ఐదు సంవత్సరాల క్రితం భార్య చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న ఆవుల శ్రీదేవితో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. అయితే వలేటివారిపాలెం మండలంలోని బొంతవారిపాలెంకు చెందిన సాదం రాజేంద్రప్రసాద్‌తో శ్రీదేవి వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం తెలిసిన మృతుడు శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో అసూయతో ముద్దాయిలిద్దరు మృతుడు శ్రీనివాసులును ఇనుప హెక్‌తో అతి కిరాతకంగా కొట్టి చంపారు. దీంతో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు ముద్దాయిలను అరెస్ట్ చేసి కందుకూరు కోర్టులో హాజరుపరచగా, కోర్టు వారికి రిమాండ్ విధించింది. ఈ హత్య కేసు ఛేదింపులో సీఐకి సహకరించిన ఎస్ఐ ఎంనారాయణ, కానిస్టేబుళ్ళు మునికృష్ణ, నారాయణ, మీరాబాషా, నజ్రుల్లా, ప్రదీప్ కుమార్, హెచ్‌జీ శ్రీనివాసులును పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

పొగాకు నారుమళ్ల పెంపకానికి అనుమతులు తప్పనిసరి

కలిగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కలిగిరి పొగాకు వేలంకేంద్రం పరిధిలో పొగనారుమళ్ళు సాగుచేసే రైతులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని వేలం నిర్వహణాధికారి వి శివకుమార్ తెలిపారు. గురువారం వేలం కేంద్రం పరిధిలోని రాచవారిపల్లి, దుత్తలూరు లక్ష్మీపురం గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న పొగాకు నారుమళ్లను బోర్డు అధికారులు, సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా నారుమళ్ళ సాగులో యజమాన్య పద్దతులు పాటించి నాణ్యమైన నారుఉత్పత్తి చేయాలని కోరారు. అదేవిధంగా పొగాకు నర్సరీలు, నారుమళ్ల అనుమతి లేకుండా సాగుచేస్తే పొగాకుబోర్డు చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. అదేవిధంగా అనుమతి లేకుండా సాగుచేసిన వారివద్ద నారు కొనుగోలుచేసి రైతు పంట వేసినా వారి బ్యారన్ లైసెన్సు రద్దుచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్రాధికారి సంతోష్‌కుమార్, క్షేత్రసహాయకులు హజరత్‌బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో చక్కటి ఆరోగ్యం

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం సాధ్యమవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రుబీనా తెలిపారు. మండలంలోని శింగమనేనిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 8వ రాష్ట్ర పోషణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.


మునోత్ పరిశ్రమలో ఎగసిపడుతున్న మంటలను అదుపు చేస్తున్న ఫైర్ ఇంజన్స్


కాలిపోతున్న మునోత్ పరిశ్రమ

రెండు పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు

ఏర్పేడు మండలం వికృతమాల వద్ద ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్-2లోని మునోత్.. నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లోని అరబిందో ఫార్మా ఇండస్ట్రీలలో గురువారం భారీ అగ్ని ప్రమాదాలు సంభవించాయి. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం తప్పింది. అయితే ఆస్తినష్టం రూ. 80 కోట్లకు పైగా జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారుల ప్రాథమిక అంచనా.

కాలిపోయిన 'మునోత్'

- ఆరుగంటల పాటు అదుపులోకి రాని మంటలు
- రూ.60 కోట్లకుపైగా నష్టం
- షార్ట్‌సర్క్యూట్, లిథియం అయాన్ బ్యాటరీ పేలుళ్ల వల్ల ప్రమాదమా?

ఏర్పేడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం వికృతమాల రెవెన్యూ పరిధిలోని మునోత్ లిథియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమలో గురువారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. తెల్లవారుజాము 3, 4గంటల మధ్య చెలరేగిన మంటలు ఉదయం 11గంటల వరకు అదుపులోకి రాలేదు. ఈ మంటల తీవ్రత కారణంగా పరిశ్రమ మొత్తం అగ్నికి ఆహుతైంది. ఆ సమయంలో పరిశ్రమలో కార్మికులెవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. రూ.65 కోట్లకుపైగా ఆస్తినష్టం జరిగినట్లు భావిస్తున్నారు. ఇక్కడ మంటలు చెలరేగి దట్టమైన పొగలు అలుముకోవడంతో సమీపంలోని డిక్సన్ పరిశ్రమ ప్రతినిధులు, కార్మికులు.. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి చెందిన అధికారులు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ వల్ల పలు విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పరిశ్రమలోని స్టోర్‌రూమ్‌లోని బ్యాటరీలు పేలడం వల్లకానీ, షార్ట్‌సర్క్యూట్ వల్ల కానీ ఈ అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ మంటలను అదుపు చేయడానికి రైల్వేకోడూరు, పాకాల, నగరి, పుత్తూరు, డిక్సన్ పరిశ్రమ, శ్రీకాళహస్తి, తిరుపతి నుంచి మరో రెండు మొత్తం ఎనిమిది ఫైరింజన్లను తెప్పించారు. డీఎఫ్వో రమణయ్య, ఆర్ఎఫ్వో గోపాల్‌రెడ్డి, ఏడీఎఫ్‌వో కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. లక్ష బ్యాటరీలతో పాటుముడిసరుకులు, విలువైన యంత్రాలు కాలిపోయాయి. ఈ సమాచారం తెలిసిన వెంటనే రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు భార్గవి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ స్థానిక వైద్యాధికారుల బృందంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

మంటలను గుర్తించిన ఆపరేటర్

మునోత్ పరిశ్రమలో గురువారం తెల్లవారుజామున సంభవించిన మంటలను ఆపరేటర్ దామోదరం మొదట గుర్తించారు. ఈ పరిశ్రమలో పగలు 120మంది వరకు పని చేస్తున్నారు. రాత్రిపూట ఇద్దరు ఆపరేటర్లు విధులకు హాజరవుతారు. బుధవారం రాత్రి విధులకు హాజరైన ఆపరేటర్ దామోదరం.. గురువారం తెల్లవారుజామున పొగతో కూడిన చిన్న మంటను ఆయన గుర్తించారు. బయటకు వచ్చి మేనేజరు శ్రీనివాసులకు సమాచారమిచ్చారు.


మునోత్ పరిశ్రమలో ఎగసిపడుతున్న మంటలు

అరబిందో ఫార్మాలో నష్టం రూ.15 కోట్లు


అరబిందో పరిశ్రమలో మంటలను అదుపుచేసేందుకు వెళ్తున్న అగ్నిమాపకశాఖ వాహనం

నాయుడుపేట/నాయుడుపేటటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లోని అరబిందో ఫార్మా పరిశ్రమలో గ్రాన్యూలేషన్ విభాగం యూనిట్‌లో గురువారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. సర్వీస్ గదిలో విద్యుత్ వైర్ల మధ్య జరిగిన రాపిడితో తొలుత చిన్నపాటి మంట చెలరేగింది. తర్వాత ప్రధాన విభాగం నుంచి మంటలు ఎగిశాయి. దట్టమైన పొగ వ్యాపించింది. అక్కడ పనిచేస్తున్న కార్మికులు అప్రమత్తమై అగ్నిమాపక సిలిండర్లతో మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి వచ్చినట్లు కార్మికులు భావించారు. అయితే అదే సమయంలో అక్కడకు కొంత దూరంలోని సప్లయ్ బాక్సులో మంటలు భారీగా చెలరేగడంతో యూనిట్ అంతటా పొగ వ్యాపించింది. దీంతో కార్మికులు బయటకు పరుగులు తీశారు .ఈలోగా కంపెనీ ప్రతినిధులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. నాయుడుపేట ఫైర్ స్టేషన్‌తో పాటు సమీపంలోని ఐదు వాహనాలు చేరుకుని మంటలను అదుపుచేశాయి. మంటలు సకాలంలో అదుపులోకి రావడంతో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాద సమయంలో 1400 మంది కార్మికులు పని చేస్తున్నారు. కాగా అగ్ని ప్రమాదం కారణంగా దాదాపు రూ.15 కోట్ల వేర ఆస్తి నష్టం జరిగిందని సంస్థ సెఫ్టీ మేనేజర్ భరత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఎఫ్‌వో రమణయ్య తెలిపారు.


పొగ కమ్ముకున్న స్థలం వద్ద అగ్నిమాపకశాఖ అధికారులు, కంపెనీ ప్రతినిధులు

ముక్కంటి ఆలయ చైర్మన్‌గా సాయిప్రసాద్

సామాన్య కార్యకర్తకు పవన్ అవకాశం


డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో సాయిప్రసాద్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తలమండలి చైర్మన్‌గా కొట్టే సాయి ప్రసాద్ నియమితులయ్యారు.రాష్ట్రస్థాయిలో కీలకమైన ఆలయం కావడంతో చైర్మన్ స్థానం కోసం పెద్దఎత్తున పోటీ నడిచింది.టీడీపీ, బీజేపీ, జనసేన నుంచి చాలా మంది ప్రయత్నాలు సాగించారు. అయితే అనూహ్యంగా జనసేన కోటాలో సాయిప్రసాద్‌ను చైర్మన్ పదవి వరించింది. శ్రీకాళహస్తి పట్టణం బహదూరు పేటకుచెందిన సాయిప్రసాద్ జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా వుంటూవచ్చాడు.మూడేళ్ల క్రితం వైసీపీ పాలనలో అప్పటి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాడు.ఇందులో భాగంగా ఓసారి దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో సీఐ అంజుయాదవ్ చెంపదెబ్బలకు గురి కావడంతో ఆ వీడియో సంచలనంగా మారింది.ఈ ఘటనతో ఒక్కసారిగా పవన్‌కల్యాణ్ దృష్టిలో పడ్డాడు.ఆయన తిరుపతికి చేరుకుని సాయిప్రసాద్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు.అలాగే పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఆ తరువాత కూటమి గెలుపు కోసం కొణిదల విజయం- కొట్టే లక్ష్యం అనే నినాదంతో 35 వాహనాల్లో శ్రీకాళహస్తితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా తన బంధు వర్గ ప్రజలను చైతన్య పరిచేలా విస్తృతంగా ప్రచారం చేశాడు.ఎన్నికల సమయంలో కూడా శ్రీకాళహస్తిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపు కోసం గట్టిగా కృషి చేశారు. ఇక జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగిన వినుత రెండు నెలల క్రితం డ్రైవర్ రాయుడి హత్య కేసులో చిక్కుకున్నారు. దీంతో అధిష్ఠానం ఆమెను జనసేననుంచి బహిష్కరించినట్లు ప్రకటించింది. అప్పటి నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శిగా, శ్రీకాళహస్తి జనసేన కీలక నేతగా సాయిప్రసాద్ మారారు.దేవాలయాల బోర్డు పదవుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని జనసేనకు కేటాయించడంతో సాయిప్రసాద్‌ను ముక్కంటి సేవా భాగ్యం వరించింది.సీఐ తనను కొట్టిన ఘటనపై నాడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ అండగా నిలబడ్డారని, ప్రస్తుతం గుర్తుపెట్టుకుని పదవి ఇచ్చిన ఘనత కూడా ఆయనకు దక్కుతుందని సాయిప్రసాద్ సంతోషం వ్యక్తం చేశాడు.ముక్కంటి భక్తులకు మెరుగైన సేవలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు.



తిరుమలలో మీనాక్షి

సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి గురువారం వేకువజామున సుప్రభాతసేవలో పాల్గొని, తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



నాగలాపురం- టీపీ కోట రోడ్డు అధ్వానంగా మారి 27 గ్రామాల ప్రజలు బాధలు పడుతున్నారు. ఆ మార్గంలో మూడు హైస్కూళ్లు ఉన్నాయి. విద్యార్థులు బడికి వెళ్లలేని పరిస్థితి.

ఆ రోడ్డు సంగతి చూడండి



గతంలోనూ ఈ సమస్యను సభ దృష్టికి తీసుకొచ్చా. అలాగే, పుత్తూరు- సత్యవేడు మార్గంలో ఊత్తుకోట సమీపంలో దాసుకుప్పం వద్ద బైపాస్ రోడ్డు రోడ్డుకు ప్రతిపాదనలోని అలైన్‌మెంట్‌ను మార్చి, భూసేకరణ చేపట్టి ప్రారంభించాలి.

- అసెంబ్లీలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

యూరియా కావాలంటే కాంప్లెక్సు ఎరువులను కచ్చితంగా కొనాలంటూ వ్యాపారులు మెలిక పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై అధికారులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలి. వైసీపీ పాలనలో వచ్చిన జగనన్న కాలనీల లేఅవుట్లపై సమగ్ర విచారణ జరిపి లబ్ధిదారులకు న్యాయం చేయాలి. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ, మండలానికి ఒకే తహసీల్దారు ఉండటం వల్ల రెవెన్యూసేవలు అందడంలో జాప్యం జరుగుతోంది. అర్బన్, రూరల్ మండలాలుగా విభజించాలి.

యూరియా అమ్మకాల్లో వ్యాపారుల మెలిక



- అసెంబ్లీలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

8న ఎర్రచందనం ఉప ఉత్పత్తులకు గ్లోబల్ టెండర్లు

మంగళం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తిమ్మినాయుడు పాళెం వద్ద గల ఎర్రచందనం సెంట్రల్ గోదాములో అక్టోబరు 8న ఎర్రచందనం ఉప ఉత్పత్తుల అమ్మకానికి ఈ వేలం వేస్తున్నట్లు గోదాము డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మ తెలిపారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా ఆన్‌లైన్‌లో వేలందారులు అప్లికేషన్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అక్టోబరు 6న సాయంత్రం ఐదు గంటల్లోగా తనిఖీ పూర్తిచేసి డాక్యుమెంట్ అప్‌లోడ్ ముగుస్తుందన్నారు. 8వతేదీ మధ్యాహ్నం 2 గంటలకు వేలం పాట ప్రారంభించి సాయంత్రం నాలుగు గంటల్లోగా ముగుస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు టెండర్ల డాక్యుమెంట్లను కొనుగోలు.ఏపీ.జీవోవి.ఎన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర సమాచారం కోసం 94409 66840, 90007 11128 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ వేలంపాటలో ఎర్రచందనం బుట్టలు 48,195 కేజీలు, హార్డ్‌వుడ్ చిప్స్ 64.856 కేజీలు, రూట్స్ 30.654 కిలోలు వేలంపాటలో ఉంచనున్నట్లు తెలిపారు.




బంగారు పళ్లెం

సెగలు పొగలైన పగలు హఠాత్తుగా చల్లబడింది. కమ్ముకొచ్చిన కారుమబ్బులతో వాలుపొద్దు సూరీడు సరసాలాడాడు. సిగ్గుమొగ్గలైన ఆకాశం స్వర్ణకాంతులతో కనువిందు చేసింది. గురువారం సాయంత్రం తిరుపతి నగరంలో కినిపించిన దృశ్యం.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్‌ఫోటోగ్రాఫర్, తిరుపతి

ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రం

- తిరుమలలోని పీఏసీ-5లో ఏర్పాటు


యంత్రాన్ని పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొత్తగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5లో తొలిసారిగా 'రెక్లైమ్ ఏస్' ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆ యంత్రాన్ని పరిశీలించారు. హైదరాబాద్‌కు చెందిన ఆ సంస్థ అధినేత వివేక్ యంత్రం పనితీరును వివరించారు. ఈ యంత్రాన్ని ఇప్పటికే ఉత్తరాఖండ్‌లోని ఛార్‌ధామ్‌లో అమర్చామని, అక్కడ పవిత్రంగా భావించే గంగలో బాటిల్ వ్యర్థాలను వేసి కాలుష్యం సృష్టించకుండా ఈ యంత్రాన్ని వినియోగిస్తున్నారన్నారు. టెట్రా ప్యాకెట్లు, స్నాక్స్ ప్యాకెట్లు వంటివి ఈ యంత్రంలో వేయవచ్చని, యూపీఐ ద్వారా లాగిన్ చేసి క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి యంత్రంలో ఉన్న రింగ్‌లో వ్యర్థాన్ని వేయాలన్నారు. వెంటనే వారికి రూ.5 బహుమతిగా లభిస్తుందన్నారు. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు.

22 నుంచి ముక్కంటి ఆలయంలో
నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేవీ నవరాత్రులలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారు రోజుకొక అలంకారంలో దర్శనమివ్వనున్నారు. 22న కలశ స్థాపన, అమ్మవారి స్థల నిర్ణయం, శైలపుత్రి అలంకారం, 23న మహావిష్ణు ఉత్సవం, బ్రహ్మచారిణిదేవి అలంకరణ, 24న తపస్సు ఉత్సవం, చంద్రఘంటాదేవి అలంకారం, 25న కూష్మాండదేవి అలంకారం, 26న అశ్వాసుర వధ ఉత్సవం, స్కంధమాతదేవి అలంకారం, 27న వ్యాఘ్రాసుర వధ ఉత్సవం, కాత్యాయని దేవి అలంకారం, 28న రక్తబీజాక్షరి ఉత్సవం, శ్రీకాళరాత్రిదేవి అలంకారం, 29న బండాసుర వధ ఉత్సవం, మహాగౌరిదేవి అలంకారం, 30న మహర్నవమి ఉత్సవం, మహిషాసుర మర్ధిని అలంకరణ, 1న పార్వేట ఉత్సవం, విజయదశమి నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఈవో కోరారు.

టీటీడీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10 లక్షల విరాళం

తిరుమల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. విజయనగరానికి చెందిన కృష్ణ హరీశ్ ఈశ్వర విరాళం డీడీని తిరుమలలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.



సర్వ దర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.2.86 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,213

తలనీలాలు సమర్పించినవారు: 29,410





అలిపిరి చెక్‌పాయింట్ వద్ద లైటింగ్ సెట్





శ్రీవారి ఆలయానికి లైటింగ్

బ్రహ్మోత్సవాలకు తొలి వెలుగులు




తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఈక్రమంలో ఇప్పటికే తిరుమలలో చేసిన విద్యుత్ అలంకరణ పనితీరును గురువారం రాత్రి పరిశీలించారు. శ్రీవారి ఆలయ గోపురం, ప్రాకారం, ధ్వజస్తంభం, వెండివాకిలి, మహద్వారం వాకిలి వద్ద చేసిన విద్యుత్ లైట్లతో పాటు తిరుమలలోని పలు ప్రదేశాల్లో అమర్చిన కటౌట్లు, తోరణాల లైట్లను వెలిగించారు. గుర్తించిన లోటుపాట్లను సవరించారు. మరోసారి శుక్రవారం ఈ విద్యుత్ అలంకరణలను పరిశీలించనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి











రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న అభ్యర్థులు



చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్ద బారులు తీరిన బస్సులు

బస్సులు బయలుదేరే సమయంలో
'అమరావతి' ప్రయాణం రద్దు

వెనుదిరిగిన డీఎస్సీ అభ్యర్థులు ● 1506 మంది రిజిస్ట్రేషన్.. వారి సహాయకులూ రాక ● భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాసేపట్లో బస్సులు బయలుదేరతాయనగా డీఎస్సీ అభ్యర్థుల అమరావతి ప్రయాణం రద్దయింది. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించతలపెట్టిన మైదానం వర్షం నీటితో నిండిపోవడంతో రద్దుచేసినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో వీరంతా తిరుపతి నుంచి వెనుదిరిగారు. ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు అమరావతిలో శుక్రవారం నియామక పత్రాలు అందించే కార్యక్రమం చేపట్టారు. దీనికిగాను ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపికైన 1408 మంది, జోనల్ అభ్యర్థులు 124 మంది కలిపి 1532 మంది.. వారి సహాయకులను కలిపి మొత్తం 3064 మందిని అమరావతికి తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 86 బస్సులను కేటాయించారు. అందరినీ తిరుపతి- రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణానికి చేరుకుని రిజిస్ట్రేన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆ ప్రకారం ఉదయం 7 గంటలకు రిజిస్ట్రేషన్ ప్రారంభించి 10.30 గంటలకు ముగించారు. మొత్తం 1532 మందికిగాను 1506 మంది ప్రయాణానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనారోగ్యం, ఇతర కారణాలవల్ల 26 మంది రాలేక అధికారుల అనుమతి తీసుకున్నారు. అభ్యర్థులు, వారి సహాయకులు 3,012 మందితో ఆ ప్రాంగణం రద్దీగా మారింది. ఓపక్క బారులు తీరిన బస్సులు, మరోపక్క వేలాదిమంది అభ్యర్థులు, వారి సహాయకులతో సందడి వాతావరణం నెలకొంది. అల్పాహార పంపిణీ తర్వాత 10.45 గంటల సమయంలో బస్సులు బయలుదేరేందుకు సిద్ధమయ్యాయి. ఆ సమయంలోట కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు, తదుపరి కార్యక్రమ తేదీని మళ్లీ ప్రకటిస్తామని అమరావతి నుంచి అధికారులకు సమాచారం వచ్చింది. భారీ వర్షంతో అమరావతిలోని సభా ప్రాంగణంలో నీళ్లు చేరడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారు. కాగా, దారి మధ్యలో 1600 మందికి గూడూరులో, మరో 1600 మందికి నెల్లూరులో భోజన ఏర్పాట్లు చేశారు. ప్రయాణం రద్దుకావడంతో ఆహార పదార్థాలు వృథాగా మారాయి.





కార్యక్రమం రద్దవడంతో వెనుదిరిగిన అభ్యర్థులు,సహాయకులు - చిన్నారితో వచ్చిన డీఎస్సీ అభ్యర్థి

తిరుమలకు తగ్గిన బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల కోసం ఆర్టీసీ ఉన్నతాధికారులు ఏడు డిపోల నుంచి సప్తగిరి బస్సులను ఎంపిక చేశారు. వీటిలో చాలా వరకు తిరుమలకు వెళ్లే బస్సులే. గురువారం ఉదయం 7 గంటలకే ఈ బస్సులు చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరాయి. ప్రయాణం రద్దయిందని తెలిసి తిరిగి ఆయా డిపోలకు బస్సులు చేరాయి. మెయింటనెన్స్ చేసుకొని మళ్లీ రోడ్డెక్కే సరికి సాయంత్రమైంది. ఈ మధ్యలో తిరుమలకు బస్సుల ట్రిప్పులు తగ్గాయి.

అన్నప్రసాద ట్రస్టు కార్పస్ నిధులు
బాగా పెరిగాయ్ : టీటీడీ ఈవో

తిరుమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం నాణ్యత, రుచులపై ప్రపంచవ్యాప్తంగా భక్తుల నుంచి వస్తున్న స్పందన కారణంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ట్రస్టు కార్పస్ నిధులు చాలా బాగా పెరిగాయని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద భవనంలో గురువారం సాయంత్రం ఆయన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా భక్తులతో మాట్లాడి దర్శన సమయాలు, టోకెన్ విధానం, క్యూలైన్ సౌకర్యాలు, అన్నప్రసాదం రుచి, తిరుమలలోని వివిధ పాయింట్ల వద్ద అన్నప్రసాదాల పంపిణీ తదతర అంశాలపై సమాచారం సేకరించారు. అలాగే వంటశాల, స్టోర్ రూమ్, జీడిపప్పు బ్లాక్స్‌లను పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అన్నప్రసాద కేంద్ర సిబ్బంది, శ్రీవారిసేవలకులతో కూడా మాట్లాడారు. అన్నదాన కార్యక్రమం 1985లో ప్రారంభమై, 1994లో అన్నప్రసాదం ట్రస్టుగా ఏర్పడిందన్నారు. 2020 వరకు ఈ కార్యక్రమం నడవడానికి టీటీడీ గ్రాంట్ ఇస్తూ వచ్చిందని, ఆతర్వాత స్వయం సమృద్ధిని సాధించిందన్నారు. ఏటా విరాళాలు పెరగుతున్నాయన్నారు. 2023-24లో కార్పస్ రూ.1,854 కోట్లు, 2024-25లో రూ.2127 కోట్లు, 2025 ఆగస్టు వరకు రూ.2,263 కోట్లకు చేరిందన్నారు. వడ్డీల రూపంలో 2024లో రూ.221 కోట్లు, 2025లో రూ.270 కోట్లకు పెరిగిందన్నారు. ప్రస్తుత వార్షిక వ్యయం రూ.150 కోట్లు ఉందన్నారు. రూ.కోటి విరాళదాతలు కూడా పెరిగారని, 2023-24లో 14 మంది ఉంటే, 2024-25లో 25 మంది, ఈ సంవత్సరం ఐదు నెలల్లో 14 మంది రూ.కోటికిపైగా విరాళాలు అందజేశారని వివరించారు. ప్రస్తుతం తాము వార్షిక బ్రహ్మోత్సవాలపై దృష్టిసారించామని, భక్తుల అభిప్రాయాలు, ఈ-మెయిళ్లు, డయల్ యువర్ ఈవో, వాట్సాప్, సర్వే, ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చే సూచనలు వ్యవస్థలో అవసరమైన చోట సవరణలు చేయడానికి కీలకంగా ఉపయోగపడుతున్నాయన్నారు. ఈతనిఖీల్లో అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

మంగళం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపంలోని మంగళం అటవీ ప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి, ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ మామండూరు నుంచి కరకంబాడీ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తూ గురువారం తెల్లవారుజామున మంగళం సమీపంలోని గ్రాండ్‌వరల్డ్ వెనుక వైపునకు చేరుకున్నారు. కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ వారి కంటబడ్డారు. పారిపోయే ప్రయత్నం చేయగా వెంటబడి ఇద్దరిని పట్టుకున్నారు. వారు తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. దుంగలతో సహా టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



హజరత్ నాందేడ్-తిరుచానూరు మధ్య మరో 4 రైలు సర్వీసులు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు18(ఆంధ్ర జ్యోతి): తిరుపతిలో నెలకొన్న రద్దీని దృషిలో ఉంచుకుని హజరత్ నాందేడ్-తిరుచానూరు మధ్య మరో 4 సర్వీసులు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్ల (07039) నాందేడ్‌లో ఈ నెల 23, 30 తేదీల్లో ఉదయం 8గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.40 గంటలకు తిరుచానూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటాయి. తిరుచానూరులో ఈనెల 24, అక్టోబరు 1 తేదీల్లో ప్రత్యేక రైలు(07040) సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు హజరత్ నాందేడ్‌కు చేరుకుంటాయి. ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బ్రిక్స్ స్కిల్ టెక్నాలజీలో కాంస్య పతకం
బ్రెజిల్‌లో మెరిసిన పద్మావతి వర్సిటీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్రెజిల్‌లో నిర్వహించిన బ్రిక్స్ స్కిల్స్ డెవెలప్‌మెంట్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంపిటేషన్‌లో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ ఎస్.రమాజ్యోతి కాంస్య పతకాన్ని సాధించారు. ఫుడ్ ప్యాకేజింగ్‌లో బయో ప్యాక్ వ్యవస్థపై ఆమె ప్రదర్శన ఇచ్చారు. కాంస్య పతకాన్ని పొందారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, డైరెక్టర్ మల్లికార్జున అభినందించారు.



రమాజ్యోతిని అభినందిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా ఏపీ

ఆర్ అండ్ డీ కాన్‌క్లేవ్‌లో డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్ రెడ్డి



ఇన్నోవేషన్, ఆర్‌అండ్‌డీ కాన్క్లేవ్‌లో పాల్గొన్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా మారడానికి ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ జి. సతీష్‌రెడ్డి చెప్పారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ 2వ ఎడిషన్ ఇన్నోవేషన్, ఆర్ అండ్ డి కాన్‌క్లేవ్ స్థానిక ఓ హోటల్లో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా వర్చువల్‌గా హాజరైన సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి అత్యాధునిక ఉత్పత్తులను అందించేలా పనిచేయాలని యువతకు సూచించారు. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం కార్యదర్శి భాస్కర్ కాటంనేని వర్చువల్‌గా మాట్లాడారు. వ్యవస్థాపకతను పెంపొందించడం, 20వేల స్టార్టప్‌లను సృష్టించడం, రాబోయే ఐదు సంవత్సరాలలో లక్ష ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా ప్రభుత్వం ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీని ప్రారంభించిందని చెప్పారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ గత ఛైర్మన్ డి.రామకృష్ణ, పుష్పిత్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పుష్పిత్ గార్గ్, విప్రో లిమిటెడ్ ఏఐ గ్లోబల్ డెలివరీ హెడ్ రఘువీరన్, క్యాప్ జెమిని ఇన్వెంట్ సీనియర్ డైరెక్టర్, ఇంటెలిజెంట్ ఇండస్ట్రీస్ మురళి చంద్రహాసన్ పారిశ్రామికవేత్తలు మలార్‌విలి, విజయ్‌కర్ణ, వికాస్ నరహరి, డి.దామోదర్‌నాయుడు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దక్షిణ మధ్య రైల్వే ఎస్‌డీజీఎం పర్యటన

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజరు చేతననంద్ సింగ్ శనివారం గుంతకల్లు డివిజన్‌లో పర్యటించ నున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. శుక్రవారం 17652 ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి శనివారం ఉదయం 3.55 గంటలకు తిరుపతి చేరుకుని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేస్తారు. 9.15 గంటలకు రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకుని 22158 ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 14.10 గంటలకు గుంతకల్లు చేరుకుని సీనియర్ స్కేల్ అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి సికింద్రాబాదుకు చేరుకుంటారు.



స్క్రాబ్ శిల్పానికి.. విగ్రహానికి
తేడా తెలియని భూమన
టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ విమర్శ

తిరుపతి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి మహావిష్ణువు విగ్రహానికి, స్క్రాబ్ శిల్పానికి తేడా తెలియడంలేదని, ఆయనకు నిజంగా హిందూ ధర్మంపై నమ్మకం ఉంటే దాన్ని ఇంట్లో పెట్టుకోవాలని టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ వ్యాఖ్యానించారు. తిరుపతిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'స్క్రాబ్ శిల్పానికి ఇంట్లో నిత్యకైంకర్యాలు చేయాలి. సంప్రదాయాలు, ఆచారాలతో భూమన వ్యాపారం చేశారు. కార్పొరేట్ దళారులను పెంచి పోషించింది ఆయనే. ఆయన హయాంలో అర్చనానంతర దర్శనం (ఏఏడీ) టికెట్లు విక్రయించి కోట్లు సంపాదించారు. కల్యాణోత్సవం పేరుతో కమీషన్లు నొక్కారు. దేవుడి నగలతో ఎగ్జిబిషన్ పెట్టాలన్న దుర్బుద్ధి ఆయనకే సాధ్యం. కేవలం రాజకీయ లబ్ధికోసం టీటీడీని వాడుకుంటున్నాడు. జగన్ ప్రోద్బలంతోనే టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నాడు. ఆయన బూటకపు మాటలను ప్రజలు నమ్మరు. వెంకటేశ్వర స్వామితో ఆటలాడినవారందరూ తగిన మూల్యం చెల్లించుకున్నారు' అని దుయ్యబట్టారు.

బ్రహ్మోత్సవాలకు ముందు అలజడికి భూమన అజెండా
టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి

తిరుమల, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందు అలజడి సృష్టించడానికి భూమన కరుణాకరరెడ్డి రహస్య అజెండాతో ఉన్నారనే అనుమానం కలుగుతోందని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. శ్రీవారి ఆలయం ముందు గురువారం మీడియాతో మాట్లాడుతూ, అలిపిరి విగ్రహం ప్రచారంపై 41 నోటీసు ఇస్తే, 23న వస్తానని చెప్పడం వెనుక ఏదో ఉందనే అనుమానం కలుగుతోందన్నారు. 'శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించేందుకు 24న సీఎం చంద్రబాబు తిరుమలకు రాబోతున్నారు. ఆ ముందురోజు వస్తానని పోలీసులకు చెప్పడం వెనుక రహస్య అజెండా ఉండచ్చు' అన్నారు. కరుణాకరరెడ్డి వంటి వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని భక్తుల నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఆయనకు ఎలా బుద్ధి చెప్పాలో టీటీడీకి తెలుసన్నారు.

ముస్సిపల్ కార్మికుల నిరసన



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్సీని అమలు చేయాలన్నారు. కమిటీ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఈనెల 23న విజయవాడలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, మురళి, వెంకటరమణ, రమేష్, శాంతివర్ధన్, పద్మమ్మ, నారాయణమ్మ, శివకుమార్, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రక్తదానం



గూడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. భారతదేశాన్ని అగ్రదేశంగా నిలిపేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఎంతో కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పనబాక కోటేశ్వరరావు, నరేంద్రరెడ్డి, దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, బ్లడ్‌బ్యాంకు ఇంచార్జి డాక్టర్ లక్ష్మీనారాయణ, మౌలాలి, బిందురెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు ప్రారంభం



వివిధ పోటీల్లో ఎంపికైన విద్యార్థినులు

గూడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీబాలుర, డీఆర్‌డబ్ల్యు కళాశాలలో గురువారం మండలస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలు ఉత్సహంగా సాగాయి. అండర్-14, 17 విభాగాల్లోని బాలికలకు షటిల్ బాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో భారతి, భాస్కర్, సుబ్రమణ్యం, కరిముల్లా, రమేష్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **డక్కిలి:** స్థానిక గురుకుల కళాశాల మైదానంలో క్రీడా పోటీలను మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు ప్రారంభించారు. . విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, ఎంపీపీ గోను రాజశేఖర్, ఎస్ఎంఎస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎస్ఎంఎస్ చైర్మన్ రత్నయ్య, హైస్కూలు హెచ్ఎం గీత, ఎంఈవో జగదీష్‌బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములను పరిరక్షించాలి



గూడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలో సీలింగ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి కోరారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 13వేల ఎకరాలకు పైగా సీలింగ్ ఆక్రమించుకుని రియల్‌ఎస్టేట్ చేస్తున్నారన్నారు.రామకృష్ణ, చంద్రశేఖర్, వేమయ్య, సుబ్బరామరాజు, సుబ్బారావు, శంకరయ్య పాల్గొన్నారు.

పగలు ఎండ.. సాయంత్రం వాన



వర్షంలో ఇళ్లకు చేరుకుంటున్న విద్యార్థులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వారం రోజులుగా విభిన్న వాతావరణం చోటుచేసుకుంటున్నది. పగలంతా సూర్యుడి సెగలతో అల్లాడిపోతున్న ప్రజలను సాయంత్రానికి వాన పకలరిస్తోంది. రాత్రి వేళల్లో ఉక్కపోత తప్పడం లేదు. గురువారం పట్టణంతో పాటు చుట్టు ప్రకలా గ్రామాల్లో ఉదయం నుంచే భానుడు భగభగమంటూ మధ్నాహ్నం వరకు తీవ్రమైన ఎండ కాసింది. సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటపాటు తేలికపాటు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది.

కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టండి



వివరాలు తెలుసుకుంటున్న సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట-మేనకూరు సెజ్‌లోని పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు చర్యలను చేపట్టాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం కోరారు. గురువారం అరబిందో కర్మాగారంలో అగ్ని ప్రమాదం సమాచారం తెలుసుకున్న ఆయన సంఘటనాస్థలికి చేరుకున్నారు. పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడారు. పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట నాయకులు విజయకుమార్‌నాయుడు,ప్రభాకర్‌నాయుడు, పురుషోత్తంరాజు ఉన్నారు.

మహిళల ఆరోగ్యం కుటుంబానికి శ్రేయస్కరం



మాట్లాడుతున్న సంషాద్ బేగం

డక్కిలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం శ్రేయస్కరంగా ఉంటుందని వెంకటగిరి అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారి సంషాద్ బేగం అన్నారు. నాయుడుపాళెంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి బిందుప్రియ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు పోషకాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుపల్లి కొత్తపాళెంలో గురువారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో పోషకాహార కార్యక్రమం జరిగింది. స్థానిక ఉన్నత పాఠశాలలో బాలికలకు పోషక ఆహారం, బాల్య వివాహాలుపై అవగాహన కల్పించారు. వల్లిపేడు వైద్యాధికారి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ కృష్ణమ్మల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

పూజా సామగ్రి, నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణసేవాసంఘ కార్యాలయంలో గురువారం బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పేద బ్రాహ్మణులకు పూజా సామగ్రి, నిత్యావసరాలు పంపిణీ చేశారు. శిరోమణిశర్మ, ఆనిమేళ్ల శివకుమార్, రామ్మూర్తి, శ్రీనివాసరావు, లలితమ్మ, నరసింహరావు, సుబ్బారావు, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి ఎయిడ్స్‌పై అవగాహన కల్గిఉండాలని నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ అన్నారు. గురువారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు లేకుండా కలిసి జీవించాలన్నారు. సుఖ వ్యాధులు, చికిత్స, ఎయిడ్స్ చట్టం గురించితెలుసుకోవాలన్నారు. సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబరు(1097)కు ఫోన్ చేసి తెలుసుకోవాన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నవజీవన్ సంస్థ నిర్వహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాటల పోటీలు

తడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం పాటల పోటీలు నిర్వహించారు. గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా సూళ్లూరుపేట జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. హైస్కూల్, ప్రాథమిక స్థాయిలో పోటీలు జరిగాయి. గెలుపొందిన వారికి ఈ నెల 20న బహుమతి ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు చెంగయ్య, శ్రీధర్‌బాబు, సుధాకర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన



స్వస్థ్‌నారీ-సశక్త్ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, టీడీపీ నాయకులు

చిల్లకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బల్లవోలులో గురువారం స్వస్థ్‌నారీ-సశక్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి, బాల్యవివాహాలు, టీబీ, మద్యపానం వంటి వాటిని నిర్మూలించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. క్యాన్సర్‌పాటు దీర్ఘకాలిక వ్యాధుల బాధితుల వివరాలను పంపితే ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఏడుకొండలు, టీడీపీ నాయకుడు వినయ్‌కుమార్, హజరత్తయ్య, మమత, ప్రవళిక, జయలక్ష్మీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతి కేసులో తొలగని సందేహాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో బాలుడు లోకేష్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే బాలుడు మృతదేహానికి బుధవారం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం పోలీసుల అనుమానాలు బలపడటంతో అనుమానాస్పద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి నోటి నుంచి నురుగలు వచ్చి ఇంటి వద్ద విగతజీవిగా పడిఉండటంతో పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

నీటివనరుల గణనపై అవగాహన



నీటి వనరులను పరిశీలిస్తున్న తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్

వాకాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొండూరులో జరుగుతున్న ఏడో మైనర్ ఇరిగేషన్ సెన్సెస్ పనితీరును తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరులను గుర్తించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న నీటి వనరుల గణనపై గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నీటి పారుదల సామర్థ్యం, యాజమాన్యం, భూమి పరిమాణం, నీటిని ఎత్తడానికి ఉపయోగించే పరికరాలు, పంపిణీకి ఉపయోగించే పద్ధతుల గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అఖిల్, వీఆర్వో హరిబాబు, తదితరులు ఉన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన

కోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్లలో ఇటీవల కొత్తగా వచ్చిన మార్పులను నిరసిస్తూ గురువారం డాక్యుమెంట్ రైటర్లు కోటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్‌లలో ఓటీపీ, ఆటో మ్యుటేషన్ పద్ధతుల వల్ల తమకు ఇబ్బందుల కలుగుతున్నాయంటూ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో శుక్ర,శనివారాలో పెన్‌డౌన్ చేస్తామన్నారు. ఆందోళన తీవ్రతరం చేస్తామని వీరు హెచ్చరించారు. అనంతరం విధులను బహిష్కరించారు.

గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు దుకాణాలు



ఆటోలో మద్యం సీసాల తరలింపు



నిండలిలో బెల్టు షాపులపై గ్రామస్తుల ఆందోళన(ఫైల్‌ఫొటో)

బాలాయపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు షాపులు పెరిగిపోయాయి. దూరాన ఉన్న ప్రభుత్వ మద్యం షాపులకు వెళ్లకుండా తమ చెంతనే ఉన్న బెల్టు షాపులకు క్యూ కడుతున్నారు. డబ్బులెక్కువైనా లెక్కచేయడంలేదు. దీనికితోడు ఇవీ సమయంతో సంబందంలేకుండా ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నాయి. వీటిని అరికట్టాల్సిన ఎక్సయిజ్ అధికారులు పట్టనట్టు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జయంపు, బాలాయపల్లి, మేల్పూరు, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో వైన్ షాపులు ఉన్నాయి. అయినా సమీప గ్రామాల్లో బెల్టు షాపులున్నాయి. వీటిని షాపుల యజమానులే సిండికేటుగా ఏర్పాటై ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు రాకుండా తామే చూసుకుంటామని నిర్వాహకులకు వీరు భరోసా కల్పిస్తున్నారని తెలిసింది. షాపు యజమానులను బేఖాతరు చేసి బెల్టు షాపు నిర్వహిస్తే మాత్రం పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు న్నాయి. నిండలి, కడగుంట, మన్నూరు, అంబలపూడి, వెంకటరెడ్డిపల్లి, మన్నూరు, కాలగంధ, పిగిలాం, పల్లిపాడు, మల్లెమాల, గాజులపల్లి , గొట్టికాడు, హస్తకావేరి తదితర గ్రామాల్లో ఐదు ఆరు చొప్పున బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఒక్కో సీసీపై రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వేసుకుని అమ్ముతున్నారని మద్యం ప్రియులు చెబుతున్నారు. బెల్టు షాపులను తొలగించాలని ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల సమావేశంలో కూడా ఎంపీపీ వీటి ఏర్పాటుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్టు దుకాణాలను ప్రోత్సహిస్తే వైన్ షాపులకు మొదట జరిమానా విధిస్తామని, మళ్లీ మళ్లీ పట్టుబడితే లైసెన్స్ లు రద్దు చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనులు ఈ మండలంలో అమలుకావడంలేదు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, ఉరుకుందమ్మ తదితరులు

నాయుడుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటితరహాలోనే పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతమైన పట్టణం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి సీఎస్ తేజ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలం సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలే దృష్ట్యా చెత్తాచెదారాలను పొడిచెత్త, తడిచెత్తగా మున్సిపాలిటి కార్మికులకు వేయాలన్నారు. మండల పరిషత్, విద్యావనరుల, పశువైద్యశాల, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ప్రాంతాల్లో చెత్తా చెదారాలను తొలగించారు. విన్నమాల పంటకాలువలోని పూడికతీత చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, లక్ష్మీ, శ్రీలక్ష్మి, ఆర్ఐ ఖాశీమ్, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నేతల అన్నదానం

వెంకటగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి మోదీ జన్మదినం సందర్భంగా వెంకటగిరిలో పేదలకు అన్న దానం నిర్విహించారు. పార్టీ నాయకురాలు దేవిక చౌదరి ఆద్వర్యంల్లో పోలేరమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అన్ని విదాల అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని లాలా కాంప్లెక్స్‌లో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సహచరుడు సాలూరి చంద్ర స్మారకార్థం టైలర్లు అన్నదానం చేశారు.

వృద్ధాశ్రమానికి వితరణ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంజాయ్‌గాంధీకాలనీలోని మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గంగాబత్తిన రామకృష్ణ దంపతులు రూ.5వేల నగదు, నిత్యావసర సరకులకు గురువారం అందజేశారు. పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడుకు చెందిన తమ మనుమడు పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. ఆశ్రమంలోని వృద్ధులను ఆదరిస్తున్న ఆశ్రమం నిర్వాహకులు సునీత బెన్నీలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో భార్గవ్, కీర్తిప్రియ, సుజాతమ్మ, గురునాథం తదితరులు ఉన్నారు.

సమ్మెకాలపు జీతాలు చెల్లించాలి : సీఐటీయూ



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

నాయుడుపేట, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు 17 రోజుల సమ్మెకాలపు జీతాలు చెల్లించాలని సీఐటీయు మండల కార్యదర్శి శివకవి ముకుంద డిమాండ్ చేశారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం మున్సిపల్ కార్మికులు, సీఐటీయు నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి కమిషనర్ ఫజులుల్లాకు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమానపనికి సమానవేతనం అందించాలని ఆయన కోరారు. మృతి చెందిన, ఉద్యోగ విరమణచేసిన మున్సిపల్ కార్మికుల కుటుంబంలోని ఒకరికి మున్సిపాలిటీలో ఉద్యోగం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులకు సేఫ్టీ పరికరాలు, రైన్ కోట్‌లు, యూనిఫాంలు ఇవ్వనున్నట్లు కమిషనర్ తెలపడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నాగరాజు, కాలేషా, సురేష్, రమణమ్మ, శ్యామలమ్మ, కృష్ణ తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి కుస్తీ పోటీల ప్రారంభం



కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి, రఫీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో గురువారం జిల్లాస్థాయి కుస్తీ పోటీలపు ప్రారంభమయ్యాయి. పోటీలను రెజ్లింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, కోచ్ ఉదయ్‌లు ప్రారంభించారు. అండర్-19 విభాగంలో దాదాపు జిల్లా నుంచి 150 మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో న్యాయవాది పసల గంగాప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు వేణుగోపాల్, బాలసుబ్బారెడ్డి, రాజ్‌కుమార్, పి. రమణయ్య, జోడో కోచ్ వి.గోపీ, లోకేష్, ప్రసాద్, కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

సూళ్లూరుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వతంత్రపురంలో ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాన్ని గురువారం మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. కొందరు కుల సంఘం పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఆలయ నిర్మాణం చేపడుతుండగా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, తహసీల్దార్ గోపీనాథ్ రెడ్డి పోలీసులతో వెళ్లి నిర్మాణాన్ని కూల్చివేశారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

కోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్‌గేమ్ ఫెడరేషన్ క్రీడాపోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్-14, అండర్-17 బాలుర ఖోఖో, త్రోబాల్, డిస్క్‌త్రో పోటీలు జరిగాయి. క్రీడల్లో పలు పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పలు క్రీడల్లో ప్రతిభను కనబరిచారు. ప్రథమస్థానంలో నిలిచారు. చివరిలో కోటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం, మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకులాల క్రీడాకారులు ఖోఖో క్రీడలో హోరాహోరీగా ఆడారు. ఎంఈవో మస్తానయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు వల్లీ, సంధాని, కృష్ణల పర్యవేక్షణలో క్రీడాపోటీలు హోరాహోరీగా సాగాయి.

కోట ప్రాంతంలో కుండపోత



గూడలి వద్ద కూలిన వేప చెట్టు

కోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కోట, విద్యానగర్‌లలో గురువారం కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో సుమారు 40 నిమిషాలపాటు వర్షం కురవడంతో గూడలి, రుద్రవరం, రాజుపాళెం గ్రామాల్లో పలుచెట్లు కూలిపోయాయి. విద్యానగర్‌లో వీధుల్లో వర్షపునీరు నిల్వచేరింది. **పెళ్లకూరు:** వేసవిని తలపిస్తున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు గురువారం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. జీలపాటూరు, చిల్లకూరు, దొడ్లవారిమిట్ట, ఏపీఎస్ నగర్, వడ్డిపాలెం తదితర గ్రామాల్లో మధ్యాహ్నం వరకు ఎండలతో అల్లాడిపోయారు. తర్వాత వాతావరణం మారి వర్షం పడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. పచ్చిరొట్ట విత్తనాలకు ఈ వర్షం ఊపిరిపోస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇటు చిరుజల్లు..అటు హరివిల్లు

ఉదయం నుంచి భానుడు ప్రతాపం చాటుకున్నాడు. మధ్యాహ్నం తీవ్రత తగ్గింది. ఇంతలోనే ఆకాశాన మబ్బులు అలముకున్నాయి. కాస్సేపటికి చిరుజల్లులు కురిశాయి. ఎండ కాస్తుండగానే జల్లులు కురుస్తుండటంతో ఆకాశాన ఇంద్రధనస్సు విరిసి ఆహ్లాదం పంచింది. చిల్లకూరు- వడ్డిపాలెం జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ఈ మనోహర దృశ్యం కనువిందు చేసింది.

-పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి